

www.epapersamayam.com
APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి : 18 | సంచిక : 200 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 29 మార్చి 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

## రాష్ట్రానికి రూ.259 కోట్ల అదనపు నిధులివ్వండి

- కేంద్ర మంత్రి నిర్మలకు మంత్రి సత్యకుమార్ వినతి



**సమయం న్యూస్, దిల్లీ:** జాతీయ ఆరోగ్య మిషన్, ఇతర పథకాల కింద రాష్ట్రానికి రూ.259 కోట్ల అదనపు నిధులు కేటాయించాలని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఆయన శుక్రవారం ఇక్కడ కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ చివరలో వైద్యఆరోగ్య శాఖకు పునఃకేటాయింపులు చేసే సమయంలో ఎన్‌హెచ్‌ఎం కింద రూ.109 కోట్లు, పనితీరు ప్రోత్సాహకం కింద రూ.150 కోట్లు రాష్ట్రానికి విడుదల చేయాలని కోరారు. తరువాత ఆయన కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, అణుశక్తి మంత్రి జితేంద్రసింగ్‌లతో సమావేశమై రాష్ట్రంలో మెడికల్ టూరిజం, క్యాన్సర్ చికిత్సల విషయంలో సహకరించాలని విన్నవించారు.

## పునాది పూర్తయిన ఇళ్లకు
# తక్షణమే చెల్లింపులు



- జూన్ ఆఖరుకు వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పూర్తి
- గ్రామాల్లో తాగునీటి సమస్యలు రావద్దు
- ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి

**సమయం న్యూస్, హైదరాబాద్:** పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, పునాది వరకు పూర్తయిన ఇళ్లకు వెంటనే చెల్లింపులు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాలో అభివృద్ధి పనులపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ... ''రాష్ట్ర ప్రభుత్వానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అత్యంత ప్రాధాన్యాంశం. దీన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాల కలెక్టర్లు పనిచేయాలి. పునాది స్థాయికి చేరిన ఇళ్ల వివరాలను గృహనిర్మాణ శాఖకు పంపిస్తే తక్షణమే రూ.లక్ష చెల్లిస్తాం. ఇందిరమ్మ ఇళ్లకు అర్హత

తరువాయి 2లో



# అపార్ట్‌మెంట్లే అచ్చొస్తున్నాయి

- ఫ్లాట్ల విక్రయాలతో రిజిస్ట్రేషన్ల శాఖకు 35% ఆదాయం
- స్థలాల లావాదేవీలతో చేకూరేది 23%
- వ్యవసాయ భూములతో 11.5% వస్తున్నట్లు అంచనా
- సాగు భూముల మార్కెట్ విలువ

తక్కువగా ఉండటమే కారణమని విశ్లేషణ

**సమయం న్యూస్, హైదరాబాద్:** స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రభుత్వ ఖజానాకు అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్ల విక్రయాలతో ఎక్కువ ఆదాయం వస్తోంది. 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం రాబడుల్లో ఇది 35% కావడం గమనార్హం. ఈమేరకు వచ్చే ఏడాది మరింత ఆదాయం సాధించాలన్న సంకల్పంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. స్థిరాస్తి మార్కెట్‌లో కొంత స్తబ్ధత ఉన్నప్పటికీ సాలీనా రూ.14,588 కోట్ల రాబడి నమోదవుతుందనే అంచనాలు

తరువాయి 2లో


## సన్నబియ్యం పంపిణీ.. తెలంగాణలోనే ప్రథమం

* 84 శాతం మంది పేదలకు లబ్ధి
* త్వరలో ఉప్పు, పప్పు, చింతపండు కూడా
* మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**సమయం న్యూస్, హైదరాబాద్:** దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ... చరిత్రలో నిలవబోతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

తరువాయి 2లో






## థాయ్‌లాండ్, మయన్మార్‌లలో
# భూ విలయం

* రెండు దేశాల్లో 150 మందికి పైగా మృతి
* 750 మందికి పైగా గాయాలు
* 12 నిమిషాల వ్యవధిలో రెండు భారీ భూకంపాలు
* బ్యాంకాక్‌లో కుప్పకూలిన 33 అంతస్తుల భవనం.. శిథిలాల కింద 100 మందికి పైగా!
* మయన్మార్‌లో వెయ్యి పడకల కొత్త ఆసుపత్రి నేలమట్టం

## అమరావతిలో...
# క్వాంటమ్ వ్యాలీ

- ఐఐటీఎం సహకారంతో ఏర్పాటు
- అత్యాధునిక సాంకేతికతను రాజధానికి తీసుకొస్తాం
- స్టార్టప్ ఆలోచనలుంటే రాష్ట్రానికి ఆహ్వానం
- ఐఐటీ మద్రాస్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం

2లో




## భానుడి భగభగలు

- 181 ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

**సమయం న్యూస్, విశాఖపట్నం:** రాష్ట్రంలో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. వేడి గాలుల ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం ప్రకాశం జిల్లా తాటిచెర్ల, వైఎస్సార్ జిల్లా కమలాపురంలో 42.6, నంద్యాల జిల్లా ఆలమూరులో 42.5, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 42.2, అనకాపల్లి జిల్లా రావికమతంలో 42.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

తరువాయి 2లో



## డిగ్రీలో ప్రతి సెమిస్టర్‌కూ
# ఓ టెక్నాలజీ సబ్జెక్టు!




- బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో పక్కాగా అమలు
- చివరి ఏడాది రెండు ఇంటర్న్‌షిప్‌లు
- సిలబస్ మార్పుపై కసరత్తు కొలిక్కి

**సమయం న్యూస్, హైదరాబాద్:** ''తెలంగాణలో విద్యార్థులు డిగ్రీ పూర్తి చేస్తే... ఆ పట్టాతో జాబ్ మార్కెట్‌లో ఉద్యోగం పొందాలి. లేదంటే కేంద్ర

తరువాయి 2లో

## ఇక్కడి బస్సు..
# అక్కడ రిజిస్ట్రేషన్

- పన్ను తక్కువ కావడంతో.. ట్రావెల్స్ బస్సులు అటువైపు మొగ్గు
- ఆ రాష్ట్రాల్లో 1,369 ఏపీ బస్సుల రిజిస్ట్రేషన్
- ఏటా 100 కొత్త బస్సులకు అక్కడే
- రాష్ట్రానికి ఏటా రూ.82 కోట్ల నష్టం



# అపార్ట్‌మెంట్లే అచ్చొస్తున్నాయి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. ఈ క్రమంలో మార్కెట్ విలువ పెంపుపైనా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**జీహెచ్ఎంసీ పరిధిలో అధికం**

అపార్ట్‌మెంట్ల నిర్మాణం, ఫ్లాట్ల విక్రయాలకు హైదరాబాద్ మహానగర పాలక సంస్థ దేశంలోనే పెద్ద మార్కెట్‌గా పేరుగాంచింది. జీహెచ్ఎంసీ వేదికగా ఏటా సగటున రూ.5 వేల కోట్ల స్థిరాస్తి వ్యాపారం జరుగుతోంది. అంతర్జాతీయంగా, దేశీయంగా నెలకొన్న పరిస్థితులతో ఈ ఏడాది వృద్ధి కాస్త సన్నగిల్లినా రిజిస్ట్రేషన్ల రాబడుల్లో 35% వాటా ఫ్లాట్ల విక్రయాలదే కావడం గమనార్హం. రాష్ట్రంలో శాసనసభ, లోక్‌సభ ఎన్నికల కారణంగా రెండేళ్లుగా పెట్టుబడులు తగ్గినట్లు అంచనాలున్నాయి. అయితే, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో బహుళ అంతస్తులు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాల నిర్మాణాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిధిలో ధరలు భారీగా ఉన్నాయి. తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో కొనుగోళ్లు కాస్త తగ్గాయన్న అంచనాలు ఉన్నాయి. అయినప్పటికీ రిజిస్ట్రేషన్ల శాఖ అంచనా వేసిన స్థాయిలోనే రాబడి వచ్చినట్లు ఆయా వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో ఈ ఏడాది ఇళ్ల స్థలాల విక్రయాలతో 23% రాబడి వచ్చింది. ఎల్ఆర్ఎస్ పూర్తయితే మరింత ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. గృహాల విక్రయాల ద్వారా 19.2% రాబడి వచ్చింది. సాగు భూముల రిజిస్ట్రేషన్లతో (ధరణి) రూ.1,668 కోట్లు సమకూరింది. ఇది మొత్తం రాబడిలో 11.5%. హైదరాబాద్ శివార్లలోని రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో ఫాం ల్యాండ్ విక్రయాలు పెద్ద ఎత్తున జరుగుతుండటంతో వాటి ద్వారానే ఎక్కువ రాబడి వస్తున్నట్లు అంచనా. ఫాం ల్యాండ్ల విక్రయాలకు సంబంధించి తక్కువ విస్తీర్ణం రిజిస్ట్రేషన్ విషయమై ప్రభుత్వానికి ఫిర్యాదులున్నాయి. వీటి కట్టడికి ప్రస్తుత ఆర్వోఆర్ చట్టంలో ఎలాంటి నిబంధనలు లేవని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో భూములు, స్థిరాస్తికి సంబంధించి... బహిరంగ ధరలకు, మార్కెట్ విలువకు మధ్య భారీ వ్యత్యాసమున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ కారణంగానే రిజిస్ట్రేషన్లు భారీగానే జరుగుతున్నా అంచనాలకు తగినట్లు రాబడి రావడం లేదని భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ విలువను సరిచేసేందుకు కసరత్తు చేస్తోంది. అయితే, ఎప్పటి నుంచి కొత్త విలువలను అమలు చేస్తారన్న దానిపై స్పష్టత లేదు. ప్రభుత్వ అంచనా ప్రకారం... వ్యవసాయ భూములకు సంబంధించి ప్రస్తుతమున్న మార్కెట్ విలువను పదిరెట్లు(501000%), ఫ్లాట్ల విలువను రెండు రెట్లు (20100%), స్థలాల విలువను ఐదు రెట్ల వరకు(50500%), గృహాలు/నిర్మాణాల విలువను రెండు రెట్లు (50100%) పెంచితేనే బహిరంగ ధర, మార్కెట్ విలువ మధ్య ఉన్న వ్యత్యాసం దాదాపు సమానమయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

# భానుడి భగభగలు

(మొదటిపేజీ తరువాయి)

181 ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. 15 మండలాల్లో తీవ్ర వడగాలులు, 90 మండలాల్లో వడగాలులు వీచాయి. శనివారం 35 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 223 మండలాల్లో వడగాలులు వీచే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 12 మండలాలు, విజయనగరం 9, శ్రీకాకుళం 6, అల్లూరి సీతారామరాజు 3, కాకినాడ 3, తూర్పుగోదావరి జిల్లాలో 2 మండలాల్లో తీవ్ర వడగాలులు వీస్తాయని అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 24 మండలాలు, శ్రీకాకుళం 19, తూర్పుగోదావరి 17, ఏలూరు 17, గుంటూరు 17, విజయనగరం 16, అనకాపల్లి 16, కృష్ణా 15, కాకినాడ 15, డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ 12, ఎన్టీఆర్ 12, పశ్చిమగోదావరి 10, ప్రకాశం 9, అల్లూరి సీతారామరాజు 8, బాపట్ల 8, విశాఖపట్నం 3, పార్వతీపురం మన్యం 2, తిరుపతి 2, నెల్లూరు జిల్లాలో ఒక మండలంలో వడగాలులకు అవకాశముందని పేర్కొన్నారు. ఆది, సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని, పిడుగులు పడొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

# సన్నబియ్యం పంపిణీ.. తెలంగాణలోనే ప్రథమం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో దాదాపు 84 శాతం మంది పేదలకు ఉచితంగా సన్నబియ్యం అందించబోతున్నామని చెప్పారు. ఉగాది రోజున ఆదివారం హుజూర్‌నగర్ వేదికగా ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి అర్హులందరికీ రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా మరో 30 లక్షల మందిని రేషన్‌కు అర్హులుగా గుర్తించబోతున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఆయన హుజూర్‌నగర్‌లో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించి వచ్చి సచివాలయంలో సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. పేదలకు త్వరలో ఉప్పు, పప్పు, చింతపండు వంటి సరకుల్ని కూడా రేషన్‌దుకాణాల ద్వారా అందిస్తామని, క్రమక్రమంగా సరకుల సంఖ్య పెంచుతామని మంత్రి వెల్లడించారు. ‘‘దొడ్డుబియ్యం స్థానంలో సన్నబియ్యం పంపిణీ వల్ల రాష్ట్రంపై రూ.2,800 కోట్ల అదనపు భారం పడనుంది. ఆ భారాన్ని భరించాలని కేంద్రాన్ని కోరా. ప్రతి లబ్ధిదారుకు 6 కిలోల బియ్యం ఇస్తాం. తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చు. అధికారుల వద్ద ఉన్న జాబితాలో పేరుంటే కార్డులేకపోయినా రేషన్ తీసుకోవచ్చు. నా సుదీర్ఘ రాజకీయ అనుభవంలో ఇంత మంచి సంక్షేమ పథకాన్ని చూడలేదు.

# థాయ్‌లాండ్, మయన్మార్‌లలో భూ విలయం

బ్యాంకాక్: నిమిషాల వ్యవధిలో వెంట వెంటనే వచ్చిన రెండు భారీ భూకంపాలు థాయ్‌లాండ్, మయన్మార్ దేశాల్లో పెను విధ్వంసం సృష్టించాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం రెండు దేశాల్లో 150 మందికి పైగా ప్రజలు మృతి చెందారు. 750 మందికి పైగా గాయపడ్డారు. అయితే మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పలు భవనాలు, ప్రార్థనాలయాలు, సాధువుల మఠాలు కుప్పకూలాయి. ప్రాణ నష్టం అత్యధికంగా మయన్మార్‌లోని మాండలే నగరం, దాని పరిసర ప్రాంతాల్లో జరిగింది. రెండు భూకంపాల కేంద్ర స్థానాలూ ఇక్కడికి సమీపంలోనే ఉన్నాయి. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో తీవ్ర ఆస్తి నష్టం జరిగింది. రెండు దేశాల్లోనూ అక్కడి ప్రభుత్వాలు వివిధ ప్రాంతాల్లో ఆత్యయిక పరిస్థితిని ప్రకటించాయి. ప్రకృతి విపత్తులో చిక్కుకున్న ఈ దేశాలకు చేయూత అందిస్తామని భారత ప్రధాని మోదీ తెలిపారు. సహాయక చర్యలకు అండగా నిలుస్తామన్నారు. భూప్రకంపనల ప్రభావం భారత్‌తో పాటు చైనా, బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లోనూ కనిపించింది. మయన్మార్, థాయ్‌లాండ్‌లలో క్షతగాత్రులైన వారికి చికిత్స అందించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ముందుకొచ్చింది. శుక్రవారం ఉదయం 11.50 గం.లకు సంభవించిన తొలి భూకంపం కేంద్రం మయన్మార్‌లోని సాగాయింగ్ పట్టణానికి 12 కి.మీ. దూరంలో ఉంది. మధ్యాహ్నం 12.02లకు వచ్చిన రెండో భూకంపం కేంద్రం కయక్స్ పట్టణానికి 20 కి.మీ.దూరంలో ఉంది. భూ ఉపరితలానికి 10.కి.మీ లోతులోనే ప్రకంపన కేంద్రాలు ఉండడంతో నష్ట తీవ్రత అధికంగా ఉందని అమెరికాకు చెందిన జియోలాజికల్ సర్వే సంస్థ వెల్లడించింది.

# డిగ్రీలో ప్రతి సెమిస్టర్‌కూ ఓ టెక్నాలజీ సబ్జెక్టు!

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రప్రభుత్వాలు, బ్యాంకింగ్ రంగాల్లో పోటీ పరీక్షలకు ఎటువంటి ప్రత్యేక కోచింగ్ లేకుండా పోటీపడాలి. ఇవీకాదంటే వారే సొంతంగా స్వయం ఉపాధి చూసుకునేలా తయారవ్వాలన్నదే మా లక్ష్యం’’ అని ఉన్నత విద్యామండలి స్పష్టంచేస్తోంది. తదనుగుణంగా రెండు నెలలుగా సిలబస్‌లో మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తోంది. తమ ప్రయత్నం దాదాపు కొలిక్కి వచ్చిందని సంబంధిత ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ మేరకు డిగ్రీలో బీఎస్సీ, బీకాంలతోపాటు బీఏ కోర్సుల్లోనూ వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ప్రతి సెమిస్టర్‌లో ఒక టెక్నాలజీ సబ్జెక్టును ఒక తప్పనిసరి పేపర్‌గా ప్రవేశపెట్టనున్నారు. డిగ్రీ మూడేళ్ల కోర్సుకు మొత్తం 120 క్రెడిట్లు, నాలుగేళ్ల ఆనర్స్ కోర్సుకు 160 క్రెడిట్లు ఇవ్వనున్నారు.

*** ఆరు టెక్నాలజీ పేపర్లు... రెండు ఇంటర్న్‌షిప్‌లు**

‘‘టెక్నాలజీపై అవగాహన లేకుంటే ప్రస్తుత పరిస్థితుల్లో కెరీర్‌లో రాణించడం కష్టం. అలాంటి యువతకు ఉద్యోగావకాశాలు కూడా తగ్గుతాయి. అందుకే పరిశ్రమలకు తగినట్లు విద్యార్థులను తీర్చిదిద్దాలి. బీఏలాంటి కోర్సులు చేస్తున్న వారు సైతం చదువు పూర్తయ్యేలోపు ఉద్యోగ నైపుణ్యాలతో బయటకు వెళ్లాలి’’ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరచూ చెబుతున్నారు. ఈమేరకు మూడేళ్ల డిగ్రీలో సెమిస్టర్‌కు ఒకటి చొప్పున సాంకేతికతకు సంబంధించిన పేపర్‌ను ప్రవేశపెడుతున్నారు. ఉదాహరణకు బీఏ ఆర్థికశాస్త్రం మొదటి సెమిస్టర్‌లో బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, రెండో సెమిస్టర్‌లో డేటా అనాలసిస్, మూడో సెమిస్టర్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ డెవలప్‌మెంట్, నాలుగులో డిజిటల్ లిటరసీ, ఐదులో ఫండమెంటల్ ఆఫ్ ఏఐ టూల్స్ అండ్ టెక్నాలజీ, ఆరో సెమిస్టర్‌లో ఇంట్రడక్షన్ టూ సైబర్ క్రైమ్స్ అనే పేపర్లు ఉంటాయి. ఒక్కో దానికి మూడు క్రెడిట్లు కేటాయిస్తారు. ఇక ఐదు, ఆరు సెమిస్టర్లలో ఇంటర్న్‌షిప్‌లు తప్పనిసరి. ఒక్కో దానికి రెండు క్రెడిట్లు ఇస్తారు. జాతీయ నూతన విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ విద్యా ప్రణాళికను రూపొందిస్తున్నారు.

*** కమ్యూనికేషన్ ఇంగ్లిష్‌పై దృష్టి**

ఆంగ్లం అంటే ఇప్పటివరకు కొందరు ప్రముఖ రచయితల పాఠాలు, కవిత్వం లాంటి వాటికి ప్రాధాన్యమిస్తూ వచ్చారు. ఇకపై ప్రథమ భాషగా ఆంగ్లమే ఉన్నా కమ్యూనికేషన్ ఇంగ్లిష్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తొలి సెమిస్టర్‌లో ప్రథమ భాషగా ఇంగ్లిష్ కమ్యూనికేషన్, రెండో సెమిస్టర్‌లో క్రిటికల్ థింకింగ్ అండ్ రీజనింగ్, మూడో సెమిస్టర్‌లో బిజినెస్ కమ్యూనికేషన్ పేరిట ఆంగ్లం సబ్జెక్టు ఉంటుంది. బీకాంలోనూ అదేమాదిరిగా టెక్నాలజీ పేపర్లు ఉండనున్నాయి. బీఎస్సీ గణితం లాంటి వాటిల్లో మెంటల్ ఎబిలిటీ, రీజనింగ్, అర్థమేటిక్ లాంటి వాటిని సైతం చేరుస్తున్నారు. రానున్న విద్యా సంవత్సరాన్ని(2025 26) ఈసారి త్వరగా ప్రారంభించాలని భావిస్తున్న ఉన్నత విద్యామండలి... అతిత్వరలో సిలబస్‌ను ఖరారు చేసి, విశ్వవిద్యాలయాల ఆమోదం కోసం పంపనుంది. ఆ తర్వాత తెలుగు అకాడమీ పుస్తకాలను ముద్రించనుంది.

# పునాది పూర్తయిన ఇళ్లకు తక్షణమే చెల్లింపులు

(మొదటిపేజీ తరువాయి)


కలిగిన లబ్ధిదారుల్లో స్థలాలు లేని వారికి... ఖాళీగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను కేటాయించాలి. మొండి గోడలతో ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి గుత్తేదారు ముందుకురాకుంటే లబ్ధిదారులే పూర్తి చేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. రానున్న మూడు నెలలు చాలా కీలకం. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా కలెక్టర్లు అప్రమత్తం కావాలి. అధికారులతో సమన్వయం చేసుకొని వారంలో మూడు రోజులు గ్రామాల్లో పర్యటించాలి. నీటికొరత ఉంటే ట్యాంకర్లతో సరఫరా చేయాలి. చెడిపోయిన బోర్లు, చేతిపంపులను తక్షణమే మరమ్మతు చేయించాలి.

*** ఉత్తర తెలంగాణకు అత్యాధునిక వైద్యం**

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని రెండు నెలల్లో పూర్తి చేసి, జూన్ చివరినాటికి అన్ని వసతులు కల్పించాలి. ఇక్కడ సేవలు ప్రారంభమైతే ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వస్తుంది. మడికొండలో డంపింగ్ యార్డు సమస్యకు వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపాలి. తర్వాత పురపాలక శాఖ కమిషనర్‌ డైరెక్టర్ శ్రీదేవి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. వరంగల్, కరీంనగర్ రహదారి ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డుకు 150200 ఎకరాల వరకు భూసేకరణ చేయాలి. వరంగల్ భద్రకాళి చెరువు పూడికతీతను వర్షాకాలంలోపు పూర్తి చేయాలి. వరంగల్ స్మార్ట్ సిటీ పనుల విషయంలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. సమావేశంలో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయని రాజేందర్, యశస్వినీరెడ్డి, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, మురళీనాయక్, రామచంద్రునాయక్, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

చెన్నై : ‘సిలికాన్ వ్యాలీ తరహాలో త్వరలో అమరావతి కేంద్రంగా క్వాంటమ్ వ్యాలీ రాబోతోంది. ఐఐటీ మద్రాస్‌తో కలిసి దీన్ని సాధ్యం చేసే పనిలో ఉన్నాం. క్వాంటమ్ టవర్‌ను నిర్మించడంతో పాటు భవిష్యత్తుకు అవసరమైన అన్ని అత్యాధునిక సాంకేతికతలు అందులో ప్రదర్శనకు ఉంచుతాం. ఈ వ్యాలీని దేశానికి కానుకగా ఇవ్వబోతున్నాం’ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఐఐటీ మద్రాస్‌లో జరుగుతున్న ఆల్ ఇండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్ 2025లో శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, యువ పరిశోధకుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టుకు ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి, బృందం కీలకం కాబోతున్నట్లు వెల్లడించారు. వారితో పాటు ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్‌టీ, కేంద్ర ప్రభుత్వం తదితరులతో కలిసి పనిచేస్తున్నామన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ సాంకేతికతతో పాటు అందరి జీవితాలకు పనికొచ్చే డీప్ టెక్నాలజీల్ని కూడా ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. 1995లో ఐటీ ఎలా మొదలుపెట్టానో, 2025లో ఏఐ



గురించి అలాగే ఆలోచిస్తున్నానని చెప్పారు. ఏపీకి వచ్చేందుకు గూగుల్ సుముఖత తెలిపిందని, డాటా సెంటర్‌ను పెడుతున్నట్లు వివరించారు. విశాఖ నుంచి సింగపూర్ దాకా సముద్రగర్భంలో సీ కేబుల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పెళ్లి.. ఉద్యోగం.. పిల్లలు ‘పెళ్లి చేసుకుని, భార్యాభర్తలిద్దరం ఉద్యోగాలు చేసుకుందాం, పిల్లలొద్దు అనుకోవద్దు. అలాగైతే జనాభా భారీగా తగ్గిపోతుంది. జనాభాను సరైన ప్రకారం పెంచితే రాబోయే 500 సంవత్సరాలు భారతీయులే ప్రపంచాన్ని శాసించే స్థితికి వస్తాం’ అని చంద్రబాబు అన్నారు. 25 ఏళ్ల కిందట జనాభా నియంత్రణ నినాదం తీసుకోవడంతో ఇప్పుడు దక్షిణ భారతదేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గిందన్నారు. ఒకప్పుడు జనాభా పెద్ద సమస్యగా ఉండేదని, ఇప్పుడు అదే అతిపెద్ద లాభంగా మారుతోందని గుర్తుచేశారు. ‘పద్ధతి ప్రకారం జనాభా పెంచుకుని 20 కోట్ల మంది భారతీయులు 150 దేశాల్లో విస్తరిస్తే.. ఆర్థిక వ్యవస్థ ఎలా మారుతుందో ఊహించుకోండి. ఒకప్పుడు మనల్ని వద్దన్న జపాన్, జర్మనీలు సైతం ఇప్పుడు భారతీయ యువత కోసం ఎదురు చూస్తున్నాయి. యువతకు ప్రపంచంలో పెద్ద డిమాండ్ ఉంది. 2047లో ప్రపంచంలోనే భారత్ పెద్ద కమ్యూనిటీ కాబోతోంది. కార్పొరేట్, పబ్లిక్ గవర్నెన్స్‌లో యువత గ్లోబల్ లీడర్లుగా మారే అవకాశం ఉంది. అందులో తెలుగువారు కచ్చితంగా ఉండాలని కోరుకుంటున్నా. మరో పాతికేళ్లపాటు భయం లేకుండా.. దేశంలో 1829 ఏళ్ల మధ్య ఉన్న పనిచేసే యువత 42 కోట్ల మంది ఉన్నారు. 2028 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ మూడో స్థానానికి రావచ్చు. 2047 నాటికి మొదటి లేదా రెండో స్థానానికి వచ్చే అవకాశాలున్నాయి’ అని చంద్రబాబు వివరించారు. ఐఐటీఎం విద్యార్థుల్లో ఎవరైనా స్టార్టప్ పెడుతుంటే వినూత్న ఆలోచనలతో ఏపీకి రావాలని చంద్రబాబు ఆహ్వానించారు. ఐఐటీ మద్రాస్‌లో 30 శాతం మంది వరకు తెలుగువారే ఉండటం గర్వంగా ఉందన్నారు. ‘నా ఆశ, నమ్మకం మీరే. ఆలోచనలకు పదును పెట్టండి. రాబోయే రోజుల్లో ఏపీలో తలసరి ఆదాయం రూ.50 లక్షలు చేయాలని అనుకుంటున్నాను. మీరు విదేశాలకు వెళ్లి ఇంతకంటే ఎక్కువ సంపాదించి రాష్ట్రానికి తిరిగిచ్చే స్థాయికి రావాలి’ అని తెలుగు విద్యార్థులతో చెప్పారు.

# ఇక్కడి బస్సు.. అక్కడ రిజిస్ట్రేషన్

అమరావతి: రాష్ట్రంలో తిరిగే అనేక ట్రావెల్స్ బస్సుల నంబరు ప్లేట్లు ఏఆర్ (అరుణాచల్‌ప్రదేశ్), ఎన్ఎల్ (నాగాలాండ్)తో ఉంటున్నాయి. ఆ రాష్ట్ర బస్సులు ఇక్కడ ఎందుకు నడుపుతున్నారనే సందేహం మీకెప్పుడైనా వచ్చిందా? ఇక్కడ ఉన్న ఎక్కువ పన్ను చెల్లించే బదులు, అతి తక్కువ పన్నులు ఉన్న ఆ రెండు రాష్ట్రాల్లో వాటి యజమాన్యాలు బస్సులను రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నాయి. దీనివల్ల మన రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.82 కోట్ల మేర గండిపడుతోంది. నిబంధనల ప్రకారం ఓ ట్రావెల్స్ బస్సు నడపాలంటే.. అది ఏ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అయిందో, ఆ రాష్ట్రానికి పన్ను (హోమ్ ట్యాక్స్) చెల్లించాలి. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వన్ ఇండియా, వన్ పర్మిట్‌లో భాగంగా.. ఆలిండియా టూరిస్ట్ పర్మిట్ కింద ఏడాదికి రూ.90 వేలు కేంద్రానికి చెల్లించి దేశంలో ఎక్కడైనా బస్సులు నడిపేందుకు వీలుకల్పించారు. ఇక్కడే అసలు లాజిక్ ఉంది. మన రాష్ట్రంలో ఓ సీటు/ బెర్తుకు త్రైమాసిక (మూడు నెలలకు) పన్ను రూ.4 వేలు చొప్పున ఉంది. ఈ లెక్కన ఓ బస్సుకు సగటున రూ.1.5 లక్షలు చొప్పున, ఏడాదికి రూ.6 లక్షలు చెల్లించాలి. ఇది ఎక్కువగా ఉందని, ఇంత మొత్తం ఎందుకు చెల్లించాలనే ఉద్దేశంతో కొందరు ట్రావెల్స్ యజమానులు ‘ఇతర’ మార్గాలను ఎంచుకుంటున్నారు.

*** ఆ రాష్ట్రాల్లో నామమాత్రమే..**

- అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ తదితర రాష్ట్రాల్లో రవాణాశాఖ పన్నులు చాలాతక్కువ.
- అరుణాచల్‌ప్రదేశ్‌లో 30, అంతకంటే ఎక్కువ సీట్లు ఉండే బస్సులకు ఏడాదికి రూ.40 వేలు మాత్రమే పన్ను వసూలు చేస్తారు. నాగాలాండ్‌లో సంవత్సరానికి రూ.56 వేలు తీసుకుంటారు.
- ఏపీతో పోల్చుకుంటే ఆ రాష్ట్రాల్లో దాదాపు రూ.5.5 లక్షల పన్నులు తక్కువ. దీంతో పెద్ద సంఖ్యలో మనరాష్ట్ర ట్రావెల్స్ బస్సులు ఈశాన్య రాష్ట్రాలబాట పడుతున్నాయి.
- గత మూడేళ్లలో ఏపీ రిజిస్ట్రేషన్ కలిగిన 1,369 బస్సులకు.. ఇక్కడ నిరభ్యంతర ధ్రువపత్రం (ఎన్‌వోసీ) తీసుకొని వెళ్లి, ఈశాన్య రాష్ట్రాల్లో రీరిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.
- ఇలా 1,369 బస్సులకు ఏడాదికి ఏపీ ప్రభుత్వం మొత్తం రూ.82.14 కోట్లు కోల్పోతోంది.

*** కొత్త బస్సులూ అక్కడికే..**

ఇక్కడి ట్రావెల్స్ యాజమాన్యాలు కొనే బస్సుల్లో ఏడాదికి సగటున 100 బస్సులను ఏపీలో కాకుండా ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. దీనివల్ల వాటి జీవిత పన్ను రూపంలో రూ.6 కోట్లు ఏటా ఏపీ ప్రభుత్వం కోల్పోతోంది. కొత్త బస్సుల ధరపై వసూలు చేసే 28 శాతం జీఎస్టీలో.. 14 శాతం రాష్ట్ర జీఎస్టీ కూడా ఆ రాష్ట్రాలకే వెళుతోంది.

*** బస్సు వెళ్లకుండానే ఫిట్‌నెస్ సర్టిఫికెట్**

ఏ బస్సుకైనా ఎనిమిదేళ్ల వరకు.. ప్రతి రెండేళ్లకు ఓసారి, ఎనిమిదేళ్లు దాటాక ఏడాదికోసారి రవాణాశాఖ వద్ద ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకొని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ)తీసుకోవాలి. అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని.. మన రాష్ట్ర పరిధిలో నడుపుతున్న బస్సులు.. ఎన్నడూ ఆ రాష్ట్రాలకు వెళ్లి ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకోవడం లేదు. ఏపీ నుంచి 2,500 కి.మీ. దూరంలో ఉన్న ఈశాన్య రాష్ట్రాలకు ఎఫ్‌సీ కోసం వెళ్లడంలేదు. ఏజెంట్ల ద్వారా, అక్కడి రవాణాశాఖ అధికారులను మేనేజ్ చేసుకొని ఎఫ్‌సీలు తెచ్చుకుంటున్నాయి. ఇదెంతో ప్రమాదకరమని రవాణాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

*** కేంద్రం దృష్టికి సమస్య..**

ఈ వ్యవహారాన్ని ఏపీ ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. కొంతకాలం కిందట అన్ని రాష్ట్రాల రవాణాశాఖ మంత్రులు, అధికారులతో.. కేంద్ర రవాణా శాఖ మంత్రి గడ్కరీ దిల్లీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసిన బస్సుల వల్ల ఏపీకి జరుగుతున్న పన్ను నష్టంపై ఆయనకు వివరించారు. అయినా ఇప్పటివరకు ఇంకా ఎటువంటి నిర్ణయం వెలువడలేదు.

# భౌతిక రసాయన శాస్త్రం పరీక్షకు 99.9% మంది విద్యార్థులు హాజరు

**: జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి**

పెద్దపల్లి , మార్చి 28:(సమయం న్యూస్) : జిల్లాలో నేడు జరిగిన భౌతిక రసాయన శాస్త్రం పరీక్షకు 99.9% మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భౌతిక రసాయన శాస్త్రం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడ ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదని అన్నారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 11 సెంటర్లను, జిల్లా లెవెల్ అబ్జర్వర్ 1 పరీక్ష కేంద్రాలు, అసిస్టెంట్ కమిషనర్ పరీక్షల విభాగం 1 సెంటర్లను, జిల్లా విద్యాశాఖ అధికారి 2 పరీక్షా కేంద్రాలను సందర్శించారని తెలిపారు. భౌతిక రసాయన శాస్త్రం పరీక్షకు 7393 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా 7385 మంది విద్యార్థులు హాజరయ్యారని, మొత్తం 99.9% హాజరు శాతం ఉందని, పరీక్షలు సజావుగా జరిగాయని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# రాయితీ పథకాలను లబ్ధిదారులు వినియోగించుకోవాలి

**: ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ**

**సమయం న్యూస్, పాలకొండ** : సీతంపేట ఐటిడిఏలో CCDP మరియు SCA to TSS నిధుల ద్వారా గిరిజన రైతులకు వివిధ రకాల యంత్ర పరికరాలను పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పంపిణీ చేసారు. ఐటిడిఎ ద్వారా ఇచ్చిన యంత్ర పరికరాలను లబ్ధిదారులు సక్రమంగా వినియోగించు కోవాలని, అదే విధంగా గ్రామంలోని ఇతర రైతులకు కూడా ఇవ్వాలని అన్నారు పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ. గ్రామానికి ఇచ్చిన యంత్ర పరికరాలను గ్రామస్తులు అందరూ వినియోగించుకోవాలని సూచించారు. వీటి ద్వారా గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఐటీడీఏ ద్వారా ఇచ్చిన యంత్ర పరికరాలు బయట వ్యక్తులకు అమ్మరాదని సూచించారు. వీటిపై ఐటిడిఎ నుంచి పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు. గతంలో ఎప్పుడూ ఇటువంటి యంత్ర పరికరముల పంపిణీ జరగలేదని, ఈ ప్రభుత్వం ఏర్పడ్డాక మళ్లీ యంత్ర పరికరాల పంపిణీ ప్రారంభించామని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన రాయితీ పథకాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఎమ్మెల్యే జయకృష్ణ. గిరిజనులకు పంపిణీ చేసిన యంత్ర పరికరములపై క్షేత్రస్థాయిలో వారికి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు ఇచ్చిన యంత్ర పరికరాలపై అధికారుల పర్య వేక్షణ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. దీనితోపాటు వ్యవసాయ శాఖకు సంబంధించిన యంత్ర పరికరాలు కూడా భవిష్యత్తులో పంపిణీ చేస్తామని అన్నారు. వైటీసీల్లో గిరిజన నిరుద్యోగ యువతకు శిక్షణలు ఇప్పించుటకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఒకటో తేదీ నాటికి పింఛను అందిస్తున్నామని అన్నారు. తల్లికి వందనం కార్యక్రమం కూడా త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. అనంతరం భామిని మండలం ఘనసర గ్రామానికి చెందిన శ్రీ గౌరీ డ్వాక్రా సంఘానికి 10 లక్షల విలువ గల ఇటుకల తయారీ యూనిట్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ యూనిట్లో లబ్ధిదారుల వాటా 2 లక్షలు కాగా, మిగిలిన 8 లక్షలు సబ్సిడీ కింద అందించారు. అనంతరం రాయితీ యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. SCA to TSS పథకం ద్వారా అందించిన యంత్ర పరికరాలకు 90 శాతం సబ్సిడీ, CCDP పథకం ద్వారా అందించిన యంత్ర పరికరాలకు 80 శాతం సబ్సిడీతో అందించారు. మొత్తంగా 64 బ్యాటరీ స్ప్రేయర్స్, 11 పవర్ వీడర్స్, 2 ఆయిల్ ఇంజన్స్, 2 పిండి మిల్లులను ఎమ్మెల్యే జయకృష్ణ మరియు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఏవో సునీల్, ఐటిడిఏ ఉద్యాన శాఖ అధికారి వెంకట గణేష్, వెలుగు ఏపీడి సన్యాసిరావు, డిపిఎం రమణ, హెచ్ వో జయశ్రీ, ఇతర అధికారులు ఎంపీపీ ఆదినారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు సవర తోట మొఖలింగం ఇమరక పవన్ తదితరులు పాల్గొన్నారు.





# నర్చరింగ్ నైబర్ హుడ్ ఛాలెంజ్ లో నగరానికి చోటు దక్కడం హర్షణీయం

**: నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి**

*** దేశవ్యాప్తం గా ఎంపిక చేసిన 9 నగరాల్లో నగరానికి దక్కిన స్థానం..**

**వరంగల్ కార్పొరేషన్, మార్చి 27(సమయం న్యూస్) :** నర్చరింగ్ నైబర్ హుడ్ ఛాలెంజ్ ఫేజ్ 2 లో నగరానికి చోటు దక్కడం హర్షణీయం అని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అన్నారు. గురువారం కేంద్ర ప్రభుత్వ డబ్ల్యు ఆర్ ఐ ప్రతినిధులతో బల్దియా ప్రధాన కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశం లో మేయర్ పాల్గొని నిర్వహించిన ప్రజెం టేషన్ ను వీక్షించి సమర్థవంతం నిర్వహించుటకు తగు మార్పులు సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గతం లో నర్సింగ్ నైబర్ హుడ్ ఛాలెంజ్ ఫేజ్ 1 లో భాగం గా బల్దియా చక్కటి ప్రతిభను కనబరచి పార్కులను ఏర్పాటు చేయడం జరిగిందని అట్టి ప్రతిభను పరిగణలోకి తీసుకొని ఫేజ్ 2 లో దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 9 నగరాల్లో జీ డబ్ల్యూ ఎం సి మరో మారు ఎంపిక కావడం గర్వకారణం అని అన్నారు. ఫేజ్ 2 లో భాగం గా నగరం లో చేపట్టాల్సిన పనులను డబ్ల్యూ ఆర్ ఐ ప్రతినిధులు దృశ్య మాధ్యమం ద్వారా ప్రదర్శిస్తూ ఏర్పాటు చేయాల్సిన మోడల్ పార్క్ లను వివరించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ నగర పరిధి లో నియోజక వర్గానికి ఒక మోడల్ పార్క్ ఏర్పాటు చేసే విధం గా ఉండాలని పలు మార్పులను సూచించారు. ఈ కార్య క్రమంలో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర ఈ ఈ లు శ్రీనివాస్ సంతోష్ బాబు డి ఈ కార్తీక్ రెడ్డి ఏ ఈ రాగి శ్రీకాంత్ డబ్ల్యూ ఆర్ ఐ ప్రతిని ధులు తదితరులు పాల్గొన్నారు.





ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా దోనుభాయి ఆశ్రమపాఠశాలలో మృతి చెందిన గిరిజన విద్యార్థి చలపతి కుటుంబసభ్యులను పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పరామర్శించారు. అనుకోని సంఘటనలో ఆకస్మికంగా మరణించిన విద్యార్థి మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురైన ఎమ్మెల్యే జయకృష్ణ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అధికారులు, ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి మృతదేహాన్ని తొందరగా కుటుంబసభ్యులకు అప్పగించాలని చెప్పారు.

# నిమ్స్ లో ఉచితంగా పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ సేవలు

నిమ్స్ లోని డాక్టర్ అమరేష్ రావు మార్గదర్శకత్వంలో, తెలంగాణ నుండి వచ్చిన ఏ రోగికైనా (తల్లిదండ్రుల ఆధార్ కార్డు, లేదా రోగి జనన ధృవీకరణ పత్రం, లేదా రేషన్ కార్డు, లేదా ఆహార భద్రతా కార్డు సరిపోతుంది) ఇతర రాష్ట్రాల వ్యక్తికి (తెలంగాణ లేదా ఆంధ్రా ఆధార్ కార్డు ఉన్నవారు) కొత్తగా నిర్మించిన పీడియాట్రిక్ కార్డియాక్ ఐసియు కింద ఉచితంగా పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ సేవలను అందించనుంది. ఏ వయసు పిల్లలకైనా అందించే ఆపరేషన్లు రోగి యొక్క నివేదికలను పరీక్షించిన తర్వాత ఆపరేట్ చేయదగినవిగా పరిగణించబడతాయి.

నిమ్స్‌లో సంప్రదించవలసిన వైద్యులు:

1.డాక్టర్ అమరేష్ రావు
2.డాక్టర్ ప్రవీణ్
3.డాక్టర్ గోపాల్

సంప్రదించాల్సిన స్థలం: నిమ్స్, పంజాగుట్ట, పాత భవనం, మొదటి అంతస్తు, డాక్టర్ అమరేష్ రావు, వార్డ్ 6 దగ్గర..

సమయం: ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు దయచేసి అవసరమైన రోగులను సంప్రదించండి...

సంప్రదింపు నంబర్: 893337836



వరల్డ్ టీబీ డే 2025, వందరోజుల టిబి కార్యక్రమం లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పాలనాధికారి రాజర్షి షా టీబీ వైరస్ కనుగొన్న ప్రొఫెసర్ రాబర్ట్ కోచ్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన గావించి, సమావేశం లో పాల్గొని అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వేసవి లో వడ దెబ్బ ఇతర వ్యాధులు ప్రభాలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త ల పై అవగాహన పోస్టర్ ను విడుదల చేశారు.



పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గల సీతంపేట మండలం సిలగాం గ్రామ వాసి అయిన శ్రీమతి బిడ్డిక సంధ్యారాణి గారిని జనసేన పార్టీ తరుపున పాలకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ గా ప్రభుత్వం నియమించినందున వారికి హార్దిక శుభాకాంక్షలు

## సంపాదకీయం

# నీతిమాలిన రాజకీయాలు పనిచేయవు !

ఎన్నికలంటేనే తిమ్మిని బమ్మిని చేయడం.. ఎత్తులు పైఎత్తులు వేయడం....ఎదుటి వారిని బురిడీ కొట్టించడం.. అబద్ధాలు చెప్పడం..ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పించడం.. ఓటర్లను ప్రలోభ పెట్టడం...ఇవన్నీ సర్వసాధారణం. మనమెంత నిజాయితీగా ఉన్నా..ఎదుటివారు అనుసరించే ఎత్తులను గమనించి ముందుకు సాగాలి. మనం నిజాయితీగా ఉంటూనే చెడును దునుమాడే ధైర్యం కూడా సొంత చేసుకోవాలి. రాజకీయంగా మనమెంత బలంగా ఉన్నా.. ఎదుటి పక్షం మనపై నిరంతరం బురదజల్లే ప్రయత్నం చేస్తుంది. బట్టకాల్చి మీద వేస్తుంటారు... ఇలాంటి అనుభవాలు మనకు లేకున్నా భరించాల్సిందే. అయితే వీటిని దీటుగా ఎదుర్కోవాలి. గట్టిగా తిప్పికొట్టాలి. ముల్లును ముల్లుతోనే తీయాలన్న సామెతను ఆధారం చేసుకుని ముందుకు సాగాలి. ప్రజల కోసం రాజకీయంలోకి దిగిన పార్టీలు కావచ్చు..నేతలు కావచ్చు... అందుకు దీటుగా ప్రచారాస్త్రాలను సంధించా ల్సిందే.. అందుకు వారి వాదనల ను బలంగా ప్రజలకు చేరవేయాల్సిందే. కొత్తగా నినాదాలు సిద్ధం చేసుకోవాల్సిందే.. అయితే ఇదే క్రమంలో మనం చేసిన మంచిని ఒకటికి పదిసార్లు పదేపదే ప్రజల చెంతకు చేర్చాలి. అభివృద్ధి పనులను ప్రజల్లో చర్చ జరిగేలా చేయాలి. గత ఐదేళ్లలో ఏ పనికి ఎంత మొత్తం కేటాయించామో చర్చ జరిగేలా చేయాలి. ఎన్ని మంచిపనులు చేశామో లెక్కలతో సహా చెప్పగల గాలి. అలాగే అవినీతికి ఎంతగా దూరం ఉన్నామో కూడా ముఖ్యం. అలాగే అభివృద్ధి కళ్లకు కనపడుతుందా అన్నది కూడా ముఖ్యమే. అందుకే రాజకీయాల్లో విలువలకు తావులేకుండా పోతోంది. రాజకీయాల్లో విలువలు పతనం అయ్యాయి. అధికారమే పరమావధిగా అన్ని పార్టీలు భ్రమిస్తున్నాయి. తామే మంచి చేశామని, చేస్తామని చెప్పకుంటూ పబ్బం గడుపుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికార పార్టీలోకి పలుఉవరు చేరికలు ఇప్పటికే మొదలయ్యాయి. ఇంకా కొనసాగుతాయి. బిఆర్ఎస్ నుంచి అధికార కాంగ్రెస్‌లో చేరిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోసం బిఆర్ఎస్ అలుపెరుగని పోరాటం చేస్తోంది. ఉప ఎన్నికలు వస్తాయని కూడా హెచ్చరికలు చేస్తోంది. ఈ విషయంలో గతంలో ఉన్న చట్టాలే ఇప్పుడూ ఉన్నాయని, ఆనాడు లేని ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయని సిఎం రేంవత్ రెడ్డి పలు సందర్భాల్లో వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ వేదికగా కూడా ఇవే వ్యాఖ్యలు చేశారు. అయితే కోర్టు తీర్పులకు, లేదా హెచ్చరికలకు స్పీకర్ లోబడి ఉండాలా అన్న చర్చ సాగుతోంది. స్పీకర్ కూడా చట్టపరమైన అధికారంలో ఉన్నవారే. అసెంబ్లీకి సంబంధించి ఆయన నిర్ణయాలకే ప్రాధాన్యం ఉన్నాయి. మని సుప్రీం తీర్పు ఎలా ఉన్నా, అధికారపక్షం మాత్రం ధీమాగా ఉంది. ఇకపోతే ఎపిలో వైకాపా నుంచి అనేకమంది జారుకున్నారు. అధికార టిడిపిలో చేరారు. అక్కడో వెసలుబాటు ఉంది. టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు మూడూ కూటమిగా అధికారంలో ఉండడంతో మూడు పార్టీల్లోనూ చేరుతున్నారు. తమకు అనుకూలంగా ఉన్న పార్టీలో చేరిపోతున్నారు. దీంతో ఏ పార్టీకి వచ్చిన నష్టం లేదు. ఎందుకంటే రాజకీయాలు ఎప్పుడూ అధికారం చుట్టే తిరుగుతాయి. అధికారం ఉన్న పార్టీకే ఆకర్శణ ఎక్కువ. సిద్ధాంత నిబద్ధతలకు ఇక్కడ తావు లేదు. అందుకే ఏ పార్టీలో గెలిచామన్న దానికి నేతలు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అధికారంలో ఉన్న పార్టీలో ఉన్నామా లేమా అని లెక్కలు వేసుకుంటున్నారు. రాజకీయాల్లో నేర్చుకున్న సిద్ధాంతం ఇది. ఈ సిద్ధాంతాన్నే ఇప్పుడు కాంగ్రెస్ అనుసరిస్తోంది. ఎపిలో కూటమి నేతలు అనుసరిస్తున్నా గతంలో కాంగ్రెస్, సిపిఐ, టిడిపి ఎమ్మెల్యేలను నిస్సిగ్గుగా టిఆర్ఎస్‌లో చేర్చుకుని తెలంగాణ పునరేకీకరణ అంటూ ప్రచారం చేశారు. ఈ సూత్రాలే ఇప్పుడు పునరావృతం అవుతుంటే బిఆర్ఎస్ భుజాలు తుడుముకుంటోంది. సిగ్గు సిగ్గు అంటూ శివాలు వేస్తోంది. కెటిఆర్ లాంటి వారు రాజకీయ బేహారులు అంటూ విమర్శలు చేస్తున్నారు.కానీ ప్రచారంలోనే అభివృద్ధిని చూపి అవినీతికి,అక్రమాలకు, అధికార దుర్వి ని యోగానికి పాల్పడ్డ విషయాలను బిఆర్ఎస్ నేతలు కనపడకుండా చేశామని అనుకున్నారు. అయితే ప్రజలకు ఇదంతా తెలిసిపోయింది. అందుకే బిఆర్ఎస్, వైకాపా నేతల అవినీతిని, అహంకారాన్ని భరించలేక పోయారు. అధికార మార్పుతో రెండు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దీనిని జీర్ణించుకుని మంచి సంప్రదాయం పాటించి మళ్లీ ప్రజల్లో పేరు తెచ్చుకుని సాగాల్సి ఉంటుంది. సామాజిక మాధ్యమాలు బలంగా ఉన్న ఈకాలంలో ప్రతి చిన్న అవినీతి, అక్రమం క్షణాల్లో ప్రజలకు చేరిపోతోంది. ప్రజల అభిప్రాయాలను తీసుకుని చేసిన మంచిని ప్రజల ముందుంచడంతో పాటు అవినీతి మట్టి అంటుకోకుండా పాలన చేయాల్సి నేతలు , అధికారం దక్కగానే అవినీతి బురదలో కూరుకుపోతున్నారు. అక్రమాలకు పాల్పడ్డారు. అవినీతిని సొంతం చేసుకున్నారు. అంతకు మించి ప్రజలతో మనకేమి సంబంధం అన్న రీతిలో వారిని దూరం పెట్టారు. ఒక సిఎం ప్రజలను కలవాల్సిన పనిలేదని అహంకారం ప్రద్శించారు. అందుకే ప్రజలు తీర్పునిచ్చారు. వారివెంట ఉన్న బలగం అంతా మెల్లగా జారుకోవడం అన్నది కూడా సహజ పరిణామం. ఇది ఏ రాజకీయ పార్టీకైనా వర్తిస్తుంది. సచ్ఛీలతతో మళ్లీ ప్రజల ముందుకు వెళ్లాలి. తమ సిద్ధాంతాలను మార్చుకోవాలి. ప్రజల కోసం పోరాటాలు చేయాలి. కానీ జగన్ అదేపనిగా విమర్శలకే పరిమితం అయ్యారు. ఐదేళ్లలో పోలవరం ముందుకు కదదలేదు. అమరావతిని పక్కన పెట్టాడు. అనేకరకమైన లిక్కర్ బ్రాండ్లతో అవినీతికి తెరలేపారు. ఇవన్నీ ప్రజల ముందున్న సజీవ సాక్ష్యాలు. అందుకే అధికారం పోవడంతో రాజరికాన్ని భరించడం,తట్టుకోవడం సాధ్యం కాదు కనక ఒక్కొక్కరే జారుకుంటున్నారు. పోరాటాలతో మళ్లీ రాటుదేలితేనే ప్రజలు వెంటనడుస్తారు.

# ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలి

* బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణమే చెల్లింపులు
* ఏ గ్రామంలోనూ త్రాగునీటి సమస్య రావొద్దు
* జూన్ చివరినాటికి వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు పూర్తికావాలి
* మడికొండ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం
* రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, వరంగల్ జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ మార్చి28( సమయం న్యూస్):** పైలట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని , బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణం చెల్లింపులు జరపాలని వరంగల్ జిల్లా ఇన్ ఛార్జి , రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లను ఆదేశించారు.శుక్రవారం సచివాలయంలో వరంగల్ స్మార్ట్ సిటీ పనులు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, త్రాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు తదితర అంశాలపై పంచాయితీ రాజ్ శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క, అటవీ , దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా శాసనసభ్యులు, కలెక్టర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతా అంశమని దీనిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్లు పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం నాలుగు విడతలలో చెల్లింపులు చేస్తుందని, మొదటి విడతలో బేస్‌మెంట్ లెవెల్ పూర్తయిన ఇండ్లకు లక్ష రూపాయిలు ఇస్తుందని, బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్ల వివరాలను హౌసింగ్ విభాగానికి పంపిస్తే తక్షణమే చెల్లింపులు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఇండ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇప్పటి వరకు కేటాయించని 2 బిహెచ్‌కే ఇండ్లను కేటాయించాలని అలాగే మొండి గోడలతో ఉన్న ఇండ్లను పూర్తిచేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రాని పక్షంలో లబ్ధిదారులే ఆ ఇండ్లను పూర్తిచేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని లబ్ధిదారులను ఎంపిక చేసి ఇండ్లను కేటాయించాలని సూచించారు. వేసవి కాలంలో ఏ గ్రామంలో పట్టణంలోగానీ త్రాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా జిల్లా కలెక్టర్లు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని అధికారులు వారంలో మూడు రోజులు గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. వచ్చే మూడు నెలలు చాలా కీలకమని ప్రజలకు ఎక్కగా త్రాగునీటి గురించి ఇబ్బంది కలగకుండా నీళ్లు రావడం లేదన్న విమర్శ రాకుండా పనిచేయాలన్నారు. నీటికొరత ఉన్న ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా త్రాగునీరు సరఫరా చేయడం, చెడిపోయిన బోర్లు, హ్యాండ్ పంప్ లను తక్షణం మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తిచేసి ఆ తర్వాత మరో నెలరోజుల్లో వైద్య సేవలకు అవసరమైన పరికరాలను అమర్చి జూన్ చివరినాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. మడికొండ డంపింగ్ యార్డు సమస్యకు వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపించి ఆ తర్వాత శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దీనికి సంబంధించి సిడిఎంఎ డైరెక్టర్ శ్రీదేవిని స్వయంగా అక్కడ పర్యటించి పరిష్కార మార్గాలను సూచించాలని ఆదేశించారు. వరంగల్, కరీంనగర్ రహదారి ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డు కోసం 150 నుంచి 200 ఎకరాల భూమిని సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. వరంగల్ భద్రకాళి చెరువు పూడికతీత పనులను ఎట్టిపరిస్థితులలోను వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పూర్తిచేయాలన్నారు. వరంగల్ స్మార్ట్ సిటీ పనుల విషయంలో అధికారులు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో శాసన సభ్యులు కడియం శ్రీహరి, నాయని రాజేందర్, యశస్విని రెడ్డి, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, మురళీనాయక్, రామచంద్ర నాయక్, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవ రాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ఆర్ అండ్ బి సెక్రెటరీ హరిచందన, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారభించిన

# ప్రభుత్వ సలహా దారుడు మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి






**బాన్సువాడ, మార్చి28 (సమయం న్యూస్) :** బాన్సువాడ నియోజకవర్గం నసురుల్లాబాద్, బీర్కూర్ మండలాల పరిధిలోని మైలారం సొసైటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో మరియు బీర్కూర్ మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి గారు,ఆగ్రోస్ చైర్మన్ శ్రీ కాసుల బాలరాజు గారు పాల్గొన్న బాన్సువాడ సబ్ కలెక్టర్ శ్రీమతి కిరణ్మయి గారు, బీర్కూర్ మండల మార్కెట్ కమిటీ అధ్యక్షులు శ్రీమతి దుర్గం శ్యామల గారు ఈ సందర్భంగా పోచారం గారు మాట్లాడుతూ... మన నియోజకవర్గంలో యాసంగి వరి ధాన్యం కోతలు అన్ని జిల్లాలతో పోలిస్తే ముందస్తుగా ప్రారంభమయ్యాయి, అందుకు అనుగుణంగా రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని మోసపోవద్దని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించుకున్నాము. రైతులకు ఎటువంటి నష్టం జరగకూడదు అని రైతు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్న సన్నం రకం దాన్యాన్నికి ప్రోత్సహకంగా క్వింటాలుకు 500/ బోనస్ ఇవ్వడం జరుగుతుంది కావున రైతులు సద్వినియోగ పరచుకోవాలి. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి 2320/ రూపాయలకు,కామన్ గ్రేడ్ 2300/ రూపాయలకు కొనుగోలు చేస్తుందని, రైతులు శుభ్రం చేసి పొల్లు లేకుండా,తేమ 17% లోపు ఉండేల కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని తెలియజేసారు.. ఈ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలి అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు,అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# రంజాన్ ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక

- మంత్రి దామోదర్ రాజానర్సింహ



సంగారెడ్డి మార్చి28( సమయం న్యూస్) : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు లో రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ, సైన్స్ టెక్నాలజీ మంత్రి దామోదర్ రాజానర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రంజాన్ ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. జోగిపేట స్థానిక శ్రీరామ గార్డెన్ ఫంక్షన్ హల్ లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ఇఫ్తార్ విందులలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, ఆర్ డి ఓ పాండు, తహసీల్దార్ విష్ణు సాగర్,, ముస్లిం మైనారిటీ ప్రతినిధులు మీర్ గోరె ఆలీ, ముస్లిం మైనారిటీ సోదరులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

www.epapersamayam.com APTEL/2006/18267
సమయం
www.samayamdaily.net



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలి

* **బేస్మెంట్ పూర్తి అయిన ఇండ్లకు చెల్లింపులు**
* **హౌసింగ్ ఎండి వీ.పీ గౌతమ్**



మెదక్, మార్చి28 ( సమయం న్యూస్) : జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఎండి విపి గౌతమ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాలో మొదటి విడత ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, హౌసింగ్ పి.డి మాణిక్యం, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఈ. ఈ పి ఆర్ నరసింహులు, ఎల్ డి ఎం నరసింహమూర్తి, ,సంబంధిత ఎంపీడీవోలతో హౌసింగ్ ఎండి వీ.పీ గౌతమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో అధికారుల నుంచి జిల్లాలోని ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి అన్ని వివరాలను పూర్తి స్థాయిలో అడిగి తెలుసుకొన్నారు. అనంతరం హౌసింగ్ ఎండి వి.పి గౌతమ్ మాట్లాడుతూ దారిద్య రేఖకు దిగువన ఉన్నవారు కాబట్టి ఇందిరమ్మండ్ల లబ్ధిదారులు 400 స్క్వేర్ ఫీట్స్ నుండి 500 స్క్వేర్ ఫీట్స్ వరకు ఇండ్లు నిర్మించుకోవచ్చు అని అదనంగా ఇంటి కొలతలతో తీసుకుని ఎక్కువ మొత్తంలో నిధులు ఉపయోగించి నిర్మించిన యెడల ఉపయోగముండదని దీనివల్ల అప్పులు బారిన పడే అవకాశం ఉందని ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించాలన్నారు గ్రామాలలో మేస్త్రీల ఇంటి నిర్మాణం, మెటీరియల్ తదితర విషయాల్లో సంబంధిత ఎంపీడీవోలు సలహాలు సూచనలు పాటించాలన్నారు. జిల్లాలో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు నెలకొల్పాలని లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా మెదక్ జిల్లాకు మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని జనవరి 26రోజున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని మెదక్ జిల్లాలో 1242 ఇండ్లు మంజూరు కాగా వివిధ దశలలో పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల ప్రక్రియ ఏమాత్రం పెండింగ్ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, తెలిపారు. వెల్దుర్తి మండలం ధర్మారం క్షేత్రస్థాయి సందర్శన చేయడం జరిగిందని ఇందిర ఇండ్ల నిర్మాణ పురోగతిలో కొన్ని అంశాలను పరిశీలించడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని ఇందిరమ్మ ఇండ్లకు ప్రభుత్వం నాలుగు విడతలగా చెల్లింపులు చేస్తుందని మొదటి విడతగా బేస్మెంట్ పూర్తయిన ఇండ్లకు లక్ష రూపాయలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు ఉగాది పండుగ అనంతరం మొదటి విడత నిధులు మంజూరు చేస్తామన్నారు. మీ మండలంలో ఇందిరమ్మ ఇండ్లు పై లబ్ధిదారులను అవగాహన కల్పించాలని ఇండ్ల పురోగతి వేగం పుంజుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎవరైనా ఉన్నట్లయితే ఉన్నతాధికార దృష్టికి తీసుకురావాలని సమస్యలను పరిష్కరించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రక్రియ లోటుపాట్లను సవరించుకొని చర్యలు చేపట్టవచ్చని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు శాంక్షన్ ఇంకా వివిధ దశలలో పెండింగ్ పనులు ఎన్ని ఉన్నాయనే పూర్తి వివరాలను ఆయా ఎంపీడీవోలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియను పరిశీలించడం జరుగుతుందని, ఎంపీడీవోలతో సమావేశాలు నిర్వహించుకుని ఇందిరమ్మండ్ల నిర్మాణ ప్రక్రియ పురోగతి పై చర్యలు చేపడతామన్నారు. దారిద్యరేఖకు దిగువనున్న వారికి చేయూతని అందించే విధంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఎంపీడీవోలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ స్థానంలో నిలిచి అవార్డు సాధించిన అధికారులు, సిబ్బందిని అభినందించిన కలెక్టర్ అభిలాష అభినవ్.

నిర్మల్ మార్చి28, (సమయం న్యూస్) : రాష్ట్రస్థాయిలో శ్రీనిధి రుణ బకాయిల వసూలులో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తిచేసి రాష్ట్రస్థాయిలోనే రెండవ స్థానంలో నిలిచి, ఇటీవలి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ సీతక్క చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రాలు అందుకున్న లోకేశ్వరం మండల ప్రగతి మహిళా సమాఖ్య బృందానికి, అధికారులకు కలెక్టర్ శాలువాతో సన్మానించి ప్రశంసించారు. రాష్ట్రస్థాయిలో జిల్లా తమ స్థానం సంపాదించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఇటువంటి అవార్డులను మరిన్ని సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్ చార్జి డిఆర్డిఓ శ్రీనివాస్, మెప్మా పిడి సుభాష్, మండల సమాఖ్య సభ్యులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగి జీవితం లో పదవీ విరమణ తప్పనిసరి

* **పరిపాలన అధికారి సేవలు అందరికీ ఆదర్శప్రాయం**
* **శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలి**
* **జిల్లా పాలనాధికారి రాజర్షి షా.**




**ఆదిలాబాద్ మార్చి28( సమయం న్యూస్):** ఈ నెల 31 మార్చి 2025 న పదవి విరమణ పొందనున్న కలెక్టరేట్ పరిపాలన విభాగం అధికారి AO రామిరెడ్డి ఈ సందర్భంగా వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో శుక్రవారం రెవెన్యు గార్డెన్ లో AO పదవీ విరమణ ఆత్మీయ వీడ్కోలు సమావేశం ను అదనపు కలెక్టర్ ఆద్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం 38 సంవత్సరాలు పనిచేసి, సేవలు అందించిన AO రామిరెడ్డి ఈ నెలలో పదవి విరమణ పొందుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ముందుగానే ఈ కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించుకోవడం జరుగుతున్నదని తెలిపారు. టైపిస్ట్ హోదా నుండి AO వరకు రెవెన్యు లో ఎన్నో మంచి సేవలు అందించి తోటి వారికి గురువు అయ్యారని, తన సేవలు వంద శాతం పరిపూర్ణంగా అందించారని కొనియాడారు. అవకాశం ఉంటే మళ్ళీ తన సేవలను ఉపయోగించుకుంటామని, అన్నారు. రిటైర్మెంట్ తర్వాత శేష జీవితాన్ని సుఖసంతోషాలతో పాటు ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలన్నారు. అవసరమైతే విహార యాత్రలు చేయాలనీ అన్నారు. AO రామిరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేయడం భగవంతుని ఆశీర్వాదం వలన అదృష్టం లభించిందనీ ఈ శాఖలో పని చేయడం చాలా సంతృప్తిని ఇచ్చిందన్నారు. టైపిస్టు గా గుడిహత్నూర్ లో ఉద్యోగం లో చేరి, అక్కడ ప్రజలకు సేవచేసే భాగ్యం కలిగిందని, మూడు సంవత్సరాలు టైపిస్టు గా పూర్తయిన తర్వాత సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్ మూడు సంవత్సరాలుగా ట్రైబల్ ఏరియాలో పనిచేసే అవకాశం , ఆ తరువాత వివిధ హోదాలో పని చేసి కలెక్టరేట్ లో AO గా పదవీ విరమణ, కలెక్టర్ గారి చేతుల మీదుగా సన్మానం పొందడం అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, తోటి ఉద్యోగులు వారి అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో rdo వినోద్ కుమార్, AVO రాజేశ్వర్, Superendent వర్ణ, తహసీల్దార్లు, జిల్లా అధికారులు, కుటుంబసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు అండగా ఉంటా..

* **మాజీ ఎమ్మెల్సీ పారుఖ్ హుస్సేన్..**

రాయపోల్, మార్చి 28, సమయం న్యూస్ గ్రామాల్లో నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. రాయపోల్ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ షాదుల్లా అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోగా ఈ విషయం తెలుసుకున్న పారుఖ్ హుస్సేన్ బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం ఉదయం పరామర్శించి పదివేల ఆర్థిక సాయం అందించి ఓదార్చారు. చిన్న వయసులోని యువకుడు షాదుల్లా మృతి చెందడం బాధాకరమన్నారు. ఆ కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉండి వారి పిల్లలను మైనార్టీ హాస్టల్లో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పిస్తామని పేర్కొన్నారు. ఆవేశంతో యువకులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని. వారు ఆత్మహత్యలు చేసుకుంటే కుటుంబాలు అనాథలుగా మిగులుతాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. షాదుల్లా వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నప్పటికీ వ్యాపారంలో నష్టం రావడంతో అప్పులు బాధతో ఆత్మహత్య పరిష్కారం కాదని ఆవేదన చెందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆపద ఎక్కడ ఉంటే తాను అక్కడ ఉంటానని. పదవులు ఎప్పుడూ ఎవరికీ శాశ్వతం కాదన్నారు. తనకు పదవి ఉన్నా లేకున్నా దుబ్బాక ప్రజలతో 30 సంవత్సరాల అనుబంధం ఉందన్నారు. తన ప్రాణం ఉన్నంతవరకు దుబ్బాక నియోజకవర్గ ప్రజలను ఎప్పుడు మరిచిపోనని ఆయన గుర్తు చేశారు. గ్రామాల్లో యువకులు మందు కల్లు తాగుడు. బెట్టింగులు అలవాటు పడి ఇలాంటి సంఘటన చోటు చేసుకుంటున్నాయని గుర్తు చేశారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిపిస్తే విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉంటే అందరూ సంతోషం వ్యక్తం చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఉమ్మడి మండల బిఆర్ఎస్ అధ్యక్షులు చింతకింది మంజూరు. సీనియర్ నాయకులు సత్తు గారి కిష్టారెడ్డి. మాజీ సర్పంచ్ కుమ్మరి శ్రీనివాస్ చారి. మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ యూసుఫ్. ఇసాక్. మహమ్మద్ రఫీ. గ్రామ నాయకులు బాసం నరసింహారెడ్డి. గౌరీ గారి పరుశరాములు. బంగారెడ్డి లింగారెడ్డి. నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక సహకార సంఘంలో మహాజన సభ సమావేశం

* **సభ్యులు తక్కువగా హాజరు కావడంతో ఆవేదన వ్యక్తం చేసిన సంఘం అధ్యక్షులు**




**వెల్దుర్తి మార్చి 28 (సమయం న్యూస్)** : మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం అధ్యక్షులు అనంత రెడ్డి ఆధ్వర్యంలో మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి సిద్దయ్య అందించిన వివరాల మేరకు ఆదాయ వ్యయాలను అర్ధవార్షిక జమ ఖర్చు నివేదికను సభాముఖంగా చదివి సంఘం సభ్యులకు వినిపించారు. తదనంతరం అధ్యక్షులు అనంతరెడ్డి మాట్లాడుతూ సహకార సంఘంలో సమా వేశం ఏర్పాటుచేసిన సభ్యులు మాత్రం అధిక సంఖ్యలో రావడంలేదని సభ్యులు అందరూ హాజరైతేనే ఇంకేమైనా కొత్త కార్యక్రమాలు చేపట్టడానికి అనువుగా ఉంటుందని మహాజన సంఘ సభ్యులు తీర్మా నించి ఆమోదించారు రుణమాఫీ కానీ రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అనంత రెడ్డి, డైరెక్టర్ కరణం మురళి, సెక్రటరీ సిద్దయ్య,డైరెక్టర్లు నర్సింలు, రమేష్ చందర్, కిష్టా గౌడ్, హనుమంతరావు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఇఫ్తార్ విందు లో ముఖ్య అతిథిగా కార్పొరేటర్

అంబర్ పేట, మార్చి, 28, సమయం న్యూస్: అంబర్ పేట్ డివిజన్ లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఇఫ్తార్ పార్టీలో ముఖ్య అతిథిగా పాల్గొన్నా అంబర్ పేట్ కార్పొరేటర్ ఇ.విజయ కుమార్ గౌడ్ గారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆకాష్ నగర్ లోని గఫారియా మజీద్ మరియు సి బ్లాక్ లోని నూర్ మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ పార్టీలో పాల్గొని ముస్లిం మైనార్టీ సోదరులకు పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు ప్రజలను ఏకం చేయడంతో పాటు మతసామరస్యానికి ప్రతికగా నిలుస్తాయని, నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేస్తూ,దానధర్మాలు చేస్తుండడం చాలా అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి జాఫర్,ముభాషీర్, షేక్ రఫీక్, యూసుఫ్ బాబా,సమీర్,,జమీల్,అతీక్, అజార్,ఆకుల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా రథోత్సవ కార్యక్రమం

* **స్వామివారికి విశేష పూజలు అందించిన భక్తజనం**



వెల్దుర్తి మార్చ్ 28, సమయం న్యూస్ : మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం బస్వాపూర్ గ్రామంలో స్వయంభుగా వెలిసిన శ్రీ భ్రమరాంబా సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో శుక్రవారం నాడు రథోత్సవ కార్యక్రమం చాలా ఘనంగా జరిగింది 48వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నాలుగవ రోజు దేవాలయ ఆవరణలో రత్తోత్సవ కార్యక్రమాన్ని పూజారి మరియు ఆలయ కమిటీ మరియు భక్తులు నిర్వహించారు. రంగురంగుల పువ్వులు, అరటి కొమ్మలతో రథాన్ని అలంకరించి అందులో ఉత్సావిగ్రహాన్ని రతంలో ఏర్పాటు చేసి పూజలు నిర్వహించిన అనంతరం భజన మరియు భక్తి పాటలతో ఆనందకేలితో రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి విశేష పూజలను అందించారు . అలాగే భక్తులంతా ఎంతో భక్తి శ్రద్ధలతో ఉదయం సాయంత్రం స్వామివారి ఆశీర్వాదం తీసుకొని ఎంతో గొప్ప అనుభూతి పొందామని భక్తులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కాలనీలో ఉదయాన్నే పర్యటించిన కార్పొరేటర్

అంబర్ పేట, మార్చి 28, సమయం న్యూస్: అంబర్ పెట్ డివిజన్ ఏంసిహెచ్ కాలనీలో ఈరోజు ఉదయాన్నే మార్నింగ్ వాక్ నిర్వహించి,కాలనీ లో పర్యటించిన అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ గారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానిక కాలనీ ప్రజలతో కలిసి mch కాలనీలో పర్యటించి లోప్రెషర్ తో మంచినీరు సరఫరా అవుతుండడం వల్ల, స్థానిక కాలనీ నాయకులతో కలిసి డిడి కాలనీ లోని జలమండలి ఆఫీసులో డీజీఎం గారిని కలిసి సమస్యను వివరించి,వేసవి కాలం కావడం,మరియు ఉగాది,రంజాన్ పండుగలు కూడా ఉండడంతో డివిజన్ లోని అన్ని ప్రాంతాల్లో కూడా మంచినీరు లో ప్రెషర్ లేకుండా చూడాలని,ప్రజలకు తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రంగు సతీష్ గౌడ్, షేక్ రఫీక్,సూరజ్ ముదిరాజ్, సంతోష్ చారి,స్థానిక బస్తీ ప్రజలు వీరేష్,సురేందర్, సాయి,యశ్వంత్,గోపి,కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న తెలంగాణ ప్రభుత్వం

* జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలకు హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్.





అంబర్ పేట, మార్చి 28, సమయం న్యూస్ : క్రీడల ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించవచ్చని, క్రీడలను ప్రోత్సహించడం అంటే భవిష్యత్ తరాలను నిర్మించడమేనని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఈరోజు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న , 4 వ కియో జాతీయ కరాటే ఛాంపియన్షిప్ 2025 పోటీలకు అయన ముఖ్య అతిది గా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, క్రీడా మైదానాల ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని, అన్ని వయసుల వారికి వర్గాల వారికి క్రీడలు ఎంతో అవసరమని రాష్ట్ర ప్రభుత్వము క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న క్రీడా మైదానాలను క్రీడాకారులు విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. బీసీ సంక్షేమ శాఖ & రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి క్రీడల పై ఆసక్తి ఉంది కాబట్టే క్రీడలకు అధిక బడ్జెట్ కేటాయింపులు జరిగాయని యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని క్రీడా మైదానాల వైపు మళ్ళే దిశగా ప్రభుత్వము వివిధ క్రీడా కార్యక్రమాలు చేపడుతుందని ఆయన అన్నారు. శాసనమండలి సభ్యులు తెలంగాణ కరాటే అసోసియేషన్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కరాటే క్రీడకు తెలంగాణలో పల్లె పల్లెలో ఎంతో ఆదరణ ఉందని, అనేక మండల కేంద్రాల్లో కరాటే శిక్షణ కేంద్రాలు విరివిగా ఉన్నాయని ఆయన అన్నారు. జాతీయ కరాటే ఛాంపియన్షిప్ దిగ్విజయంగా నిర్వహిస్తున్న తెలంగాణ లో భవిష్యత్తులో ఆసియన్ కరాటే ఛాంపియన్షిప్ కూడా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిలాష అని , త్వరలోనే ఆసియన్ కరాటే ఛాంపియన్షిప్ ను హైదరాబాద్ లో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మరిన్ని జాతి అంతర్జాతీయ పోటీలు హైదరాబాదులో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్ని క్రీడా ఫెడరేషన్లు హైదరాబాద్ వైపు చూస్తున్నాయని అన్నారు. గ్రామస్థాయి నుండి క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే ఈ క్రీడా పోటీల నిర్వహణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి శ్రీమతి సోనీ బాలాదేవి, భారతక్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్, ఒలంపియన్ బాక్సర్ నికత్ జరిన్, కరాటే ఇండియా ఆర్గనైజేషన్ అధ్యక్షులు భరత్ శర్మ కార్యదర్శి సంజీవ్ జాంగ్ర, కోశాధికారి బంకిన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కీర్తన్ వివిధ రాష్ట్రాల కరాటే అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

: మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ దే



గజ్వేల్, మార్చి 28 : మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి డిసిసి అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ .మైనార్టీల అభ్యున్నతి అంటే భవన నిర్మాణాలు, షాపింగ్ కాంప్లెక్స్ లు కాదని, ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించి తోడ్పాటునిస్తేనే న్యాయం జరుగుతుందన్నారు.. ప్రభుత్వం కుల గణన చేపట్టి మైనార్టీల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇవ్వగా, రిజర్వేషన్లు, ఉద్యోగాలు, విద్య, సంక్షేమ పథకాల అమలులో అవకాశం కల్పించేందుకు కుల గణన ఎంతో తోడ్పడిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాన్ని తమ హయాంలో జరగనివ్వమని, మైనార్టీ డిక్లరేషన్ లో భాగంగా మైనార్టీ సబ్ ప్లాన్ అమలు చేసేందుకు ప్రభుత్వ పరిశీలిస్తుందన్నారు . దేశంలో అన్ని మతాలు, కులాలతోపాటు మైనార్టీల రక్షణ కాంగ్రెస్ తోనే సాధ్యపడుతుందని అన్నారు. మైనార్టీల ఆర్థిక ఉద్ధరణ, సాధికారత లక్ష్యంగా ప్రభుత్వ పథకాల అమలులో ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా గజ్వేల్ మైనార్టీలు ఏ సమస్య ఉన్న తనను నేరుగా సంప్రదించవచ్చున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి, తంజములు మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మతిన్, మైనార్టీ నాయకులు, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## స్కావెంజర్ల వేతనాలు వెంటనే చెల్లించాలి

గజ్వేల్, మార్చి28: పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్ల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్యాల విజయేందర్ రెడ్డి, సుంచు నరేందర్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డిఇఓ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పరిశుభ్రత కోసం ప్రభుత్వం గత సెప్టెంబర్ లో స్కావెంజర్లను నియమించిందని, వారికి మూడు నెలల వేతనం మాత్రమే చెల్లించాలని డిసెంబర్ నుండి వారి వేతనాలు పెండింగ్లో ఉన్నాయన్నారు. వేతనాలు రాక స్కావెంజర్లు ఇబ్బందులకు గురవుతున్నారనీ వెంటనే ప్రభుత్వం స్కావెంజర్ల వేతనాలకు సంబంధించిన నిధులు విడుదల చేయాలని కోరారు. సామాజిక కుల గణన సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సిసిఎల్ లు మంజూరు చేయాలని,ఎస్ ఎస్ సి 2024 సంవత్సర మూల్యాం కన విధులు నిర్వహించిన ఉపాధ్యా యులకు రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలన్నారు. ఎస్ ఎస్ సి 2025 మూల్యాంకన కేంద్రంలో సదుపాయాలు కల్పించాలని డీఈఓ ను కోరారు.

# అమీన్‌పూర్‌లో విషాదం.. ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారుల అనుమానాస్పద మృతి



జిన్నారం: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో విషాదం చోటుచేసుకుంది. అనుమానాస్పద రీతిలో ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారులు మృతిచెందారు. తల్లి తీవ్రమైన కడుపునొప్పితో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. స్థానిక సీఐ నరేశ్ కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో చెన్నయ్య, ఆయన భార్య రజిత తమ ముగ్గురు పిల్లలు సాయికృష్ణ (12), మధుప్రియ (10), గౌతమ్ (8)తో కలిసి నివాసముంటున్నారు. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో భార్యాభర్తలతో పాటు ముగ్గురు పిల్లలు ఇంట్లోనే భోజనం చేశారు. చెన్నయ్య అన్నం, పప్పు తిన్నాడు. భార్య, ముగ్గురు పిల్లలు పెరుగన్నం తిన్నారు. భోజనం తర్వాత చెన్నయ్య ట్యాంకర్ నడిపేందుకు చందానగర్ వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చాడు. రాజిత తలుపులు తెరవగా.. పిల్లలు నిద్రపోతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రాజితకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో స్థానికుల సహాయంతో చెన్నయ్య ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. ఆ తర్వాత పిల్లలను పరిశీలించగా.. అప్పటికే ముగ్గురూ మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెన్నయ్యది రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెడకపల్లి. ఉపాధి కోసం గత కొంతకాలంగా ఆయన అమీన్‌పూర్‌లో ఉంటున్నాడు. చిన్నారుల మృతిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హోదా కుదరదు: కేంద్రం

దిల్లీ: పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలంటూ తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. కృష్ణానదీ జలాలపై తెలంగాణ, ఏపీ మధ్య వివాదం కోర్టులో ఉన్న నేపథ్యంలో జాతీయ హోదా సాధ్యం కాదని జల్‌శక్తి శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను తిరిగి పంపినట్లు లోక్‌సభకు కేంద్రం వెల్లడించింది. 2024 డిసెంబర్‌లోనే ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపింది. ఈ మేరకు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు జల్‌శక్తిశాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది.

# భర్త వర్ధంతి సభలో భావోద్వేగాలకు గురైన మంత్రి సీతక్క

* భర్త రాము వర్ధంతిలో సీతక్క కన్నీటి పర్యంతం
* సీతక్కను ఓదార్చిన విమలక్క
* మోకాళ్లపల్లిలో జరిగిన రాము వర్ధంతి సభ




తెలంగాణ పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క తన జీవితంలోని కష్టాలను, ప్రజలకు సేవ చేయాలనే తన సంకల్పాన్ని గుర్తు చేసుకున్నారు. తన భర్త కుంజ రాము వర్ధంతి సభలో ప్రసంగిస్తూ, సీతక్క ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. భర్త స్మృతులతో కదిలిపోయారు. కన్నీటిపర్యంతమైన ఆమెను విమలక్క ఓదార్చారు. ఒకప్పుడు ఉద్యమంలోపని చేస్తున్నసమయంలో ఎన్‌కౌంటర్ నుంచి తృటిలో తప్పించుకున్నానని, అది తనకు పునర్జన్మ అని మంత్రి సీతక్క అన్నారు. ఈ జన్మలో పేదలు, ఆదివాసీలు, అట్టడుగు వర్గాల హక్కుల కోసం తన చివరి శ్వాస వరకు పోరాడతానని ఆమె పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మోకాళ్లపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో, సీతక్క తన కుమారుడు సూర్య, కోడలు కుసుమాంజలితో కలిసి భర్త కుంజ రాము స్తూపం వద్ద నివాళులర్పించారు.

# ఈ పదార్థాలతో.. వేసవిలో చల్లగా..!

**వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతల వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురై వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంటుంది. మరి, అలా జరగకుండా ఉండాలంటే ఈ కాలంలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలి. అందుకు కొన్ని ఆహార పదార్థాలు ఉపయోగపడతాయని చెబుతున్నారు పోషకాహార నిపుణులు. ఈ క్రమంలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి ఎలాంటి పదార్థాలు తీసుకోవాలో తెలుసుకుందాం రండి..**



**ఈ పండ్లతో..**

వేసవి వేడి నుంచి తట్టుకోవడానికి ఈ కాలంలో వచ్చే కొన్ని పండ్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా తాటి ముంజలు, పుచ్చకాయ, కర్బూజ.. వంటి పండ్లు అటు రుచికి రుచితో పాటు ఇటు శరీరానికి చలువను అందిస్తాయి.

**డీహైడ్రేషన్ బారిన పడకుండా..**

వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుకోవడం చాలా ముఖ్యం. అందుకోసం ఎక్కువ మొత్తంలో నీళ్లు తాగడం తప్పనిసరి. అయితే నీళ్లతో పాటు నిమ్మరసం, లెమన్‌గ్రాస్ టీ, మిల్క్‌షేక్, కోకమ్ పండుతో చేసిన షర్బత్, గుల్‌కంద్, ఆమ్ పన్నా, సత్తు డ్రింక్ (శెనగలుబెల్లం కలిపి సత్తుపిండితో చేసే పానీయం), అంబలి.. మొదలైనవి తీసుకోవాలి. ఇవి రుచికరంగా ఉండడమే కాదు.. వీటితో శరీరానికి ఎక్కువ మొత్తంలో నీరు కూడా అందుతుంది.

**భోజనానికి ఇవి..**

డ్రింక్స్, పండ్లే కాదు.. మనం రోజూ రెండు పూటలా తీసుకునే భోజనం విషయంలోనూ పలు మార్పులుచేర్పులు చేసుకోవాలి. పెరుగన్నం అప్పడాలు కలిపి తీసుకోవడం, జొన్నల్ని బాగా ఉడికించుకొని సబ్జీ (అన్ని కూరగాయలను కలిపి చేసే కర్రీ)తో కలిపి తినడం, గంజి, పోహా, పెరుగు, అన్నం మామిడికాయ పచ్చిపులుసు.. ఇలాంటి ఫుడ్ కాంబినేషన్స్‌ని భోజనంలో భాగంగా తీసుకోవాలి. ఫలితంగా ఇవి అధిక వేడి నుంచి శరీరాన్ని కాపాడి శరీరానికి చల్లదనాన్ని అందిస్తాయి.







# పనీర్ నీటితో.. ఇలా కూడా..!



**ఇంట్లో పాలు విరిగిపోతే పనీర్, కలాకండ్.. వంటి పదార్థాలు తయారుచేసుకుంటాం. అయితే ఈ క్రమంలో వడకట్టిన నీటిని కొంతమంది బయట పడేస్తుంటారు. కానీ ప్రొటీన్లు, ఇతర పోషకాలు నిండి ఉన్న ఈ నీటిని ఇంట్లో పలు రకాలుగా ఉపయోగించుకోవచ్చంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**

చపాతీ పిండి తడపడానికి సాధారణ నీటిని ఉపయోగిస్తాం. అయితే పనీర్ నీటిని కూడా ఇందుకోసం వాడుకోవచ్చు. తద్వారా చపాతీ/పూరీ.. వంటివి మెత్తగా రావడంతో పాటు వీటి రుచి కూడా పెరుగుతుంది.

* బేకింగ్ వంటకాలు తయారుచేసుకునే క్రమంలో.. పిండిని తడుపుకోవడానికీ ఈ నీటిని వినియోగించుకోవచ్చు.
* కూరల్లో గ్రేవీ కోసం కొన్ని నీళ్లు పోయడం మనకు అలవాటే! అయితే ఈసారి సాధారణ నీటికి బదులు పనీర్ నీటిని పోసి చూడండి.. అటు రుచీ పెరుగుతుంది.. ఇటు అందులోని పోషకాలూ శరీరానికి అందుతాయి.
* అలాగే కొన్ని కూరలు, ఇతర వంటకాల తయారీలో భాగంగా పులుపు ఎక్కువైతే.. కొద్దిగా ఈ నీటిని కలపచ్చు.
* పండ్లుకాయగూరలతో చేసిన జ్యూసులు, స్మూతీస్.. వంటివి తయారుచేసుకునేటప్పుడు నీటికి బదులుగా పనీర్ నీటిని ఉపయోగిస్తే.. రుచి మరింతగా పెరుగుతుంది. వీటిలో చక్కెర వేసుకోకపోయినా తియ్యదనం వస్తుంది.



* పాస్తా, నూడుల్స్, బంగాళాదుంపలు, బియ్యం, ఇతర కాయగూరలు.. వంటివి ఉడికించే క్రమంలోనూ పనీర్ నీటిని వినియోగించుకోవచ్చు. అలాగే కొన్ని రకాల పప్పుల్ని కూడా ఈ నీటిలో నానబెట్టుకోవచ్చట. తద్వారా ఈ నీటిలోని పోషకాలు ఆయా పదార్థాల్లో చేరి ఒంటికి పడతాయి.
* ఉప్మా వంటివి తయారుచేసే క్రమంలో సాధారణ నీటితో పాటు పనీర్ నీటిని కూడా పోస్తే దాని రుచి పెరుగుతుంది.
* ప్రొటీన్లు, ఇతర పోషకాలు నిండి ఉన్న ఈ పనీర్ నీటిని మొక్కలకూ పోయచ్చు. అయితే సాధారణ నీటితో కలిపి మాత్రమే వాడాలి.
* ఫేస్‌ప్యాక్స్, హెయిర్ మాస్కుల్లోనూ ఈ నీటిని వాడచ్చు. అలాగే ఈ నీటితో జుట్టును కండిషనింగ్ చేసుకుంటే కేశాలు పట్టులా తయారవుతాయి. ఇందులోని ప్రొటీన్ జుట్టు ఆరోగ్యానికీ మేలు చేస్తుంది. అయితే ఈ చిట్కా పాటించిన తర్వాత జుట్టు జిడ్డుగా అనిపిస్తే.. గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయాలి.
* కొంతమంది ఇంట్లోనే కంపోస్ట్ ఎరువులు తయారుచేసుకుంటారు. ఈ క్రమంలో పనీర్ నీటిని అందులో పోస్తే.. ఎరువు లోని పోషకాల శాతాన్ని పెంచచ్చు.



సీజన్‌ను బట్టి మన జీవన శైలిలోనూ కొన్ని మార్పులు చేసుకోవాలి. ప్రత్యేకించి వేసవి కాలంలో శరీరానికి చలువనిచ్చే పండ్లను, కూరగాయలను ఆహారంలో తప్పకుండా భాగం చేసుకోవాల్సిందే. కాలానుగుణంగా లభించే పండ్లను అధికంగా తీసుకోవడం వల్ల శరీరంలో నీటి స్థాయులు పెరగడమే కాకుండా కాలక్రమేణా రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ఇక ఎండ వేడిమి నుంచి శరీరానికి తక్షణ శక్తినందించే పండ్లు ఎన్నో ఉన్నప్పటికీ కర్బూజ ప్రత్యేకత వేరు.

## పోషకాల గని.. కర్బూజ!

**పోషకాలు పుష్కలం!**

* ఈ పండులోని వివిధ పోషకాలు శరీరంలో నీటి స్థాయులను పెంచి డీహైడ్రేట్ కాకుండా కాపాడతాయి.
* ఫైబర్ మలబద్ధకం, మూత్ర సంబంధ సమస్యలు, అలసట, రక్తపోటు సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.
* ఫోలిక్ యాసిడ్ యాంటీ కోయాగ్యులెంట్ ఫ్యాక్టర్‌గా పనిచేసి రక్తనాళాల్లో గడ్డకట్టిన రక్తాన్ని కరిగించడంలో సహాయపడుతుంది. కండరాల నొప్పులు కూడా తగ్గిపోతాయి.
* కర్బూజా లో విటమిన్‌ఎ కూడా అధికంగా ఉంటుంది. ఇది కంటి సమస్యలను దూరం చేయడమే కాకుండా కంటి చూపు సామర్థ్యాన్ని పెంచుతుంది.
* క్యాలరీలు తక్కువగా ఉండే ఈ పండును ఆహారంలో భాగం చేసుకుంటే చర్మ సంబంధ సమస్యలు దూరమవడంతో పాటు అధిక బరువు కూడా నియంత్రణలోకి వస్తుంది.

# MOVIE TIME



## బ్లేజర్‌లో ఫారియా అబ్దుల్లా క్లీవేజ్ షో

టాకీస్: జాతిరత్నాలు మూవీతో టాలీవుడ్ ఆడియన్స్ ను ఎట్రాక్ట్ చేసిన ఫారియా అబ్దుల్లా నటిగా మంచి మార్కులే కొట్టేసింది. 'చిట్టి నీ నవ్వంటే లక్ష్మీ పటాసే.. ఫట్టుమని పేలిందా గుండే ఖల్లాసే..' అంటున్నారు నెటిజెన్లు. ఫరియా అబ్దుల్లా ఫొటో షూట్లతో హీట్ పుట్టిస్తోంది. ఆమె ఫ్యాషన్ షోకు ఫిదా అవుతున్నారు. లైక్ లు కామెంట్లతో ఇన్ స్టాలో అభిమానాన్ని చాటుతున్నారు. నిమాలు తక్కువైనా, ఫొటోషూట్లతో మాత్రం సోషల్ మీడియాలో హీట్ పెంచుతోంది. తాజాగా ఆమె షేర్ చేసిన లేటెస్ట్ లుక్ అందర్నీ మైమరపిస్తోంది. తెల్లటి బ్లేజర్ సూట్లో స్టన్నింగ్ గా మెరిసి పోయింది ఫరియా. క్లాసిక్ వైట్ ప్యాంట్ సూట్ కంపోసిషన్ కు బ్రైటు గోల్డ్ జ్యువెలరీ కాంబినేషన్ ఏ లెవల్లో ఉంటుందో ఈ ఫొటోలు ప్రూవ్ చేశాయి. మెటాలిక్ బ్రేస్లెట్స్, లేయర్డ్ నెక్ పీస్, నోస్ రింగ్ వంటి ఆభరణాలు ఆమె లుక్కుని మరింత అందంగా మార్చేశాయి. ఈ కాంప్లిమెంటరీ లుక్ లో ఫారియా తన గ్లామర్ తో పాటు తన స్టయిల్ ఓరియెంటే షన్ ను కూడా చూపించగలి గింది. ఆమె ధరిస్తున్న డ్రెస్, జ్యువెలరీ, స్టైలింగ్ అన్నీ కలిసే ఒక ఆర్ట్ వర్క్ ఫీలయ్యేలా ఉన్నాయి. ఫరియా ప్రస్తుతం కొన్ని సినిమాలు, వెబ్ ప్రాజె క్ట్స్ లో భాగంగా బిజీగా ఉంది.





## వెంకటేశ్‌తో హరీశంకర్ సినిమా





టాకీస్: ఇటీవల విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించాడు టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్. దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందించిన ఈ చిత్రం పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను ఆకర్షించడంలో విజయవంతమైంది. ఈ సినిమా ద్వారా వెంకటేష్ తన కెరీర్‌లో అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. దాదాపు రూ.300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టాడు. అయితే ఈ సినిమా విజయంతో ఉత్సాహంగా ఉన్న ఈ స్టార్ హీరో, తన తదుపరి చిత్రాన్ని సిద్ధం చేసే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వెంకటేష్ వివిధ దర్శకుల నుంచి కథలు వినడంలో బిజీగా ఉన్నాడని సమాచారం. ఈ సందర్భంలోనే ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ కూడా ఓ కథను వెంకటేష్‌కు వినిపించినట్లు తెలుస్తోంది. ఈ కథ వెంకీకి నచ్చడమే కాకుండా, నిర్మాత సురేష్ బాబు కూడా దీన్ని ఆమోదించినట్లు వార్తలు వస్తున్నాయి. సినీ వర్గాల్లో ఈ ప్రాజెక్ట్‌ను వెంకటేష్ ఖరారు చేసినట్లు చర్చలు జరుగుతున్నాయి. ఈ చిత్రం వెంకటేష్ కెరీర్‌లో 77వ సినిమాగా రానున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ సినిమాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సినీ సర్కిల్స్‌లో టాక్ నడుస్తోంది.

## పూరీ జగన్నాథ్‌ను రిజెక్ట్ చేసిన హీరోయిన్

### ఆ తర్వాత సినిమాల కోసం ఎదురుచూపులు



టాకీస్: టాలీవుడ్ ఇండస్ట్రీలో డేరింగ్ అండ్ డాషింగ్ డైరెక్టర్ అంటే ఠక్కున గుర్తొచ్చే పేరు పూరి జగన్నాథ్. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన బద్రి సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టారు. 2006లో మహేష్ బాబు నటించిన పోకిరి సినిమాతో బాక్సాఫిఈస్ వద్ద సంచలనం సృష్టించారు. తెలుగులో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను రూపొందించి.. హీరోయిజం అంటే సరికొత్త అర్థం చెప్పారు. పూరి సినిమాలకు యూత్ లో మంచి క్రేజ్ ఉంటుంది. పూరి జగన్నాథ్ సినిమాల కోసం అభిమానులు, యూత్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. అలాంటి టాప్ డైరెక్టర్ సినిమాలో అవకాశం వస్తే నటించాలని ఎంతో మంది ఆర్టిస్టుల కల. కానీ ఓ హీరోయిన్ మాత్రం పూరి జగన్నాథ్ సినిమా నుంచి ఆఫర్ రిజెక్ట్ చేసిందట. మోడలింగ్ రోజుల్లో ఇండస్ట్రీ గురించి ఏమి తెలియదని.. అప్పుడే పూరి జగన్నాథ్ సినిమాలో ఛాన్స్ వచ్చిందని కానీ ఆ ప్రాజెక్ట్ చేయడానికి ఒప్పుకోలేదని చెప్పుకొచ్చింది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. తనే హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్. తెలుగు చిత్రపరిశ్రమలో ఒకప్పుడు టామ్ హీరోయిన్ ఆమె. స్టార్ హీరోల సరసన ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. పెళ్లి తర్వాత సైతం కెరీర్ లో రాణిస్తుంది రకుల్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్.. కెరీర్ ఆరంభం, పెళ్లి గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లోనే మోడలింగ్ చేశానని.. ఆ సమయంలో తన ఫోటోస్ చూసి కన్నడ సినిమా నుంచి ఆఫర్ వచ్చిందని.. అప్పట్లో తనకు సౌత్ ఇండస్ట్రీ గురించి అంతగా తెలియదని చెప్పుకొచ్చింది. ఆ సినిమా వాళ్లు తన తండ్రికి ఫోన్ చేసి మాట్లాడటంతో గిల్లి సినిమాలో నటించానని.. సినిమా షూటింగ్ వల్ల చదువులో సమస్యలు వచ్చాయని.. ఫస్ట్ మూవీతోనే నటనకు మంచి గుర్తింపు వచ్చిందని చెప్పుకొచ్చింది. ఆ తర్వాత తనకు పూరి జగన్నాథ్ నుంచి కాల్ వచ్చిందని.. దాదాపు 70 రోజులు డేట్స్ అడిగారని.. అందుకు తాను అంగీకరించలేదని తెలిపింది.



## కొత్త లుక్స్‌తో హల్‌చల్ చేస్తున్న అనన్యపాండే

టాకీస్: బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే టాలీవుడ్ ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలే. ఈ ముద్దుగుమ్మ 1998 అక్టోబర్ 30న ముంబైలో జన్మించింది. ఆమె తండ్రి చంకీ పాండే కూడా బాలీవుడ్‌లో ప్రముఖ నటుడు, తల్లి భావనా పాండే ఒక కాస్ట్యూమ్ డిజైనర్. అనన్య 2019లో "స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2" చిత్రంతో సినీ రంగంలోకి అడుగు పెట్టింది. ఈ సినిమాలో ఆమె నటనకు ఫిల్మ్‌ఫేర్ అవార్డు ఫర్ బెస్ట్ ఫీమేల్ డెబ్యూ కూడా లభించింది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ చిన్నది. అనన్య తన కెరీర్‌లో పతి పత్నీ ఔర్ వో, లైగర్, డ్రీమ్ గర్ల్ 2 వంటి చిత్రాల్లో నటించింది. లైగర్ ఈ బ్యూటీ తొలి తెలుగు చిత్రం. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరసన ఆమె నటించింది, కానీ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేదు. ఆ తర్వాత ఈ భామ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లపై దృష్టి సారించింది. ఆమె సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది.

## క్రేజీ కాంబో.. విజయదేరవకొండతో కీర్తిసురేష్ సినిమా





టాకీస్: 'మహానటి'తో జాతీయ ఉత్తమ నటి అవార్డు అందుకున్న కీర్తి సురేష్ ఈ మధ్య తెలుగులో కనిపించడం లేదు. గతేడాది వివాహం బంధంలోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ 'బేబీ జాన్'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. గతంలో హెూమ్లీగా కనిపించే ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్‌లోకి వెళ్లగానే తనలోని మరో కోణాన్ని బయటపెట్టింది. బేబీ జాన్‌తో ఆమె గ్లామర్‌కి నార్త్ జనాలు ఫిదా అయిపోయారు. దీంతో సినిమా డిజాస్టర్ అయినా కీర్తి మాత్రం మంచి మార్కులే కొట్టేసింది. పెళ్లి తర్వాత దూకుడి పెంచిన కీర్తి మళ్లీ టాలీవుడ్‌పై ఫోకస్ పెట్టింది. దీంతో ఆమెకు వరుస ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయి. నితిన్, వేణు యెల్దండి కాంబినేషన్లో దిల్ రాజు నిర్మిస్తోన్న 'ఎల్లమ్మ'లో కీర్తి సురేష్ నటిస్తోందంటూ వార్తలొస్తున్నాయి. ఈ క్యారెక్టర్ కోసం ముందుగా సాయిపల్లవిని అడిగితే డేట్స్ అడ్జట్స్ లేక నో చెప్పేసిందట. దీంతో ఆమె ఆఫర్ కీర్తి వద్దకు చేరినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై యూనిట్ నుంచి ఎలాంటి సమాచారం లేదు. తాజాగా ఈ భామ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ పక్కన ఛాన్స్ కొట్టేసింది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' అనే సినిమాలో నటిస్తున్నాడు. దీని తర్వాత 'రాజావారు రాణిగారు' ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'రౌడీ జనార్ధన్' మూవీ చేయనున్నాడు. దీనికి దిల్ రాజు నిర్మాత. ఈ ప్రాజెక్టులో కీర్తి సురేష్‌ని తీసుకుంటే కాంబినేషన్ అదిరిపోతుందని మేకర్స్ భావిస్తున్నారట. ఇక సుహాస్ పక్కన 'ఉప్పు కప్పురంబు' మూవీ ఇప్పటికే కన్ఫామ్ అయిన సంగతి తెలిసిందే. జాతీయ ఉత్తమ నటిగా అవార్డు అందుకుని 'మహానటి'గా కీర్తించబడుతోన్న కీర్తి సురేష్ ఇకపై కమర్షియల్ బాటలో నడుస్తూ గ్లామర్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకోవాలని తెగ ఆరాటపడుతోందట. చాలామంది హీరోయిన్లు కెరీర్ తొలినాళ్లలో గ్లామర్ పాత్రలు చేసి పెళ్లి తర్వాత హెూమ్లీగా కనిపించడానికి ప్రయత్నిస్తారు. కీర్తి మాత్రం ఇన్నాళ్లూ కాస్త పద్ధతిగా కనిపించి పెళ్లి తర్వాత గ్లామర్ ట్రీట్ ఇవ్వడానికి తెగ కష్టపడుతోంది. బాలీవుడ్‌కి వెళ్లిన తర్వాత తత్వం బోధపడి ఇలాంటి నిర్ణయం తీసుకుని ఉండొచ్చని ఫాన్స్ అనుకుంటున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులను లైన్లో పెడుతోన్న కీర్తికి ఒకట్రెండు హిట్లు పడ్డాయంటే ఇప్పట్లో ఆమె కెరీర్‌కు ఢోకా ఉండదు. ఇక బాలీవుడ్‌లో 'బేబీ జాన్' తర్వాత రాకింగ్ స్టార్ రణబీర్ కపూర్ పక్కన కీర్తి ఛాన్స్ కొట్టేసినట్లు ప్రచారం జరుగుతోంది. రొమాంటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కే ఈ మూవీలో కీర్తి సురేష్ గ్లామర్ షోకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందట. అయితే ప్రస్తుతం రామాయణ, లవ్ అండ్ వార్‌తో యానిమల్ పార్క్ వంటి చిత్రాలతో రణబీర్ బిజీగా ఉండటంతో ఈ ప్రాజెక్టు ఎప్పుడు పట్టాలెక్కుతుందో క్లారిటీ లేదు.

## రూ.700 కోట్ల బడ్జెట్‌తో హృతిక్‌రోషన్ సినిమా



టాకీస్: బాలీవుడ్ స్టార్ నటుడు హృతిక్ రోషన్ మెగాఫోన్ పడుతున్నాడు. ఈ విషయాన్ని అతడి తండ్రి రాకేష్ రోషన్ ఎక్స్ వేదికగా పంచుకున్నాడు. హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ హీరో చిత్రం క్రిష్ ఎంత పెద్ద హిట్టయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అప్పటివరకు హాలీవుడ్ సూపర్ హీరోలు మాత్రమే తెలిసిన ప్రేక్షకులకు ఇండియన్ సూపర్ హీరోగా హృతిక్ రోషన్ అలరించాడు. కోయి మిల్ గయా, క్రిష్, క్రిష్ 3 సినిమాలు రాగా బ్లాక్ బస్టర్ అందుకున్నాయి. ఇప్పుడు ఇదే ఫ్రాంచైజీ నుంచి క్రిష్ 4 రాబోతుంది. మొదటి మూడు పార్టులకు హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్ దర్శకత్వం వహించగా.. తాజాగా వచ్చే క్రిష్ 4తో హృతిక్ మెగాఫోన్ పట్టబోతున్నాడు. ఈ విషయాన్ని తెలుపుతూ.. హృతిక్ తండ్రి రాకేష్ రోషన్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. దుగ్గూ (హృతిక్ రోషన్) 25 సంవత్సరాల క్రితం నిన్ను నటుడిగా పరిచయం చేశాను. ఇప్పుడు 25 ఏళ్ల తర్వాత ఆదిత్య చోప్రా నేను కలిసి దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం చేయబోతున్నాం. దర్శకుడిగా నీ ప్రయాణంలో నువ్వు అనేక విజయాలు సాధించాలని ఆశిస్తున్నాను. మా ప్రతిష్టాత్మక చిత్రం 'క్రిష్ 4'కి నీవు దర్శకత్వం వహిస్తుండటం సంతోషంగా ఉందంటూ రాకేష్ రోషన్ రాసుకోచ్చాడు. ఈ విషయం తెలిసిన బాలీవుడ్ ప్రముఖులు హృతిక్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు ఈ ప్రాజెక్ట్ రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్నట్లు సమాచారం.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.